Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు
# RAJADHANI VARTALU


ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్దతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699


అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 233 పేజీలు (Pages): 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 25 - 4 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# పాలనా సంస్కర్తకు ప్రతిష్ఠాత్మక అవార్డు

## - ఎకనమిక్ టైమ్స్ బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు స్వీకరించనున్న సీఎం - ముంబైకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రతిష్ఠాత్మక మీడియా సంస్థ ఎకనమిక్ టైమ్స్ ప్రకటించిన బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ 2025 అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేపు అందుకోనున్నారు. ముంబైలో శనివారం సాయంత్రం జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం అమరావతి నుంచి బయల్దేరి వెళ్లనున్నారు. శనివారం మధ్యాహ్నం 12.50 గంటలకు సీఎం క్యాంప్ ఆఫీసు నుంచి బయలుదేరి వెళ్తారు. 2.40 గంటలకు ముంబై విమానాశ్రయం చేరుకుంటారు. అనంతరం సాయంత్రం 5.25 గంటలకు వెన్యూ అయిన జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌కు వెళ్తారు. రాత్రి 9.30 వరకు ఎకనమిక్ టైమ్స్ నిర్వహించే అవార్డుల కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రి 9.50 గంటలకు ముంబై నుంచి తిరుగు ప్రయాణం అవుతారు.

**విప్లవాత్మక విధానాల అమలుకు దక్కిన గుర్తింపు**

రేపు సాయంత్రం 5.30 నుంచి 7.30 గంటల వరకూ జరిగే కార్యక్రమంలో ఆయన ఈ అవార్డు అందుకోనున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహా దిగ్గజ పారిశ్రామిక దిగ్గజాల సమక్షంలో ఎకనమిక్ టైమ్స్ సంస్థ ఈ అవార్డు ను ముఖ్యమంత్రికి ప్రధానం చేయనుంది. ఏపీలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సహా స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు లాంటి విప్లవాత్మక విధానాలు అమలుకు గాను ఎకనామిక్ టైమ్స్ ఈ అవార్డుకు సీఎం చంద్రబాబును ఎంపిక చేసింది. గతంలో అరుణ్ జైట్లీ, పీయూష్ గోయల్, నితీష్ కుమార్, అశ్వినీ వైష్ణవ్, జైశంకర్ తదితర ప్రముఖులకు బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు వరించింది.

**సీబీఎన్ బ్రాండ్ ఇమేజ్‌తో ఏపీకి పెట్టుబడులు**

రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం, పారిశ్రామిక విధానాల్లో విప్లవాత్మక మార్పులు-పారిశ్రామిక అనుకూల పాలసీలు తీసుకు రావడంలో చంద్రబాబు పోషిస్తున్న పాత్రను ఎకనమిక్ టైమ్స్ జ్యూరీ కొనియాడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ సమయంలోనే ఏపీకి రూ.20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకు రావడంలో విజయవంతం కావడం, పారిశ్రామిక అనుమతుల ప్రక్రియను సరళతరం చేస్తూ అమలు చేస్తున్న సంస్కరణలు, టెక్నాలజీ , ఇన్నోవేషన్, ఐటీ, ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో ఏపీని అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో ఆయన చేస్తున్న కృషికి గాను ఈ ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చిన అనుభవంతో పాటు, ప్రస్తుతం అమరావతి, విశాఖపట్నం వంటి నగరాలను ఆర్థిక కేంద్రాలుగా తీర్చిదిద్దడంలో సీఎం చంద్రబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు.

### విఐటి-ఏపి స్కూల్ ఆఫ్ లా, విఐటి-ఏపి విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో

# అభివృద్ధి చెందుతున్న సాంకేతిక యుగంలో ప్రైవేట్ అంతర్జాతీయ న్యాయంపై అంతర్జాతీయ సదస్సు




**అమరావతి, (రాజధాని వార్తలు):** 2026: విఐటి-ఏపి విశ్వవిద్యాలయంలోని విఐటి-ఏపి స్కూల్ ఆఫ్ లా మరియు ఇండియన్ సొసైటీ ఆఫ్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో "అభివృద్ధి చెందుతున్న నూతన సాంకేతిక యుగంలో ప్రైవేట్ అంతర్జాతీయ న్యాయం: సమస్యలు, సవాళ్లు మరియు ముందడుగు" అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును ఏప్రిల్ 24 2026న ఘనంగా ప్రారంభించారు. ఈ సదస్సులో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విద్యావేత్తలు, న్యాయ నిపుణులు, పరిశోధకులు మరియు విద్యార్థులు పాల్గొని, న్యాయం మరియు సాంకేతికత మధ్య ఏర్పడుతున్న కొత్త అనుసంధానాలపై చర్చలు జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డా॥ లూథర్ రంగ్రేజీ (లీగల్ అండ్ ట్రీటీస్ విభాగం అదనపు కార్యదర్శి, భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ) హాజరయ్యారు. అయన మాట్లాడుతూ డిజిటల్ వ్యవస్థలు దేశ సరిహద్దులను దాటి విస్తరించుతున్న ఈ కాలంలో, అభివృద్ధి చెందుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అంతర్జాతీయ న్యాయ సహకారం మరింత కీలకంగా మారిందని అన్నారు. ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ వాణిజ్య న్యాయ కమిషన్, ప్రైవేట్ లా ఏకీకరణ అంతర్జాతీయ సంస్థ వంటి సంస్థలు సరిహద్దు దాటి వచ్చే న్యాయ సమస్యలను పరిష్కరించడంలో చురుకుగా పనిచేస్తున్నాయని తెలిపారు. అయితే, ఇవి ఒకే ఒప్పందం కింద పనిచేయకుండా, పరస్పర సహకారంతో తమ తమ నైపుణ్య రంగాల్లో పని చేస్తాయని ఆయన వివరించారు. గౌరవ అతిథి డా॥ వి.జి. హెగ్డే (ఐఎస్ఐఎల్ కార్యనిర్వాహక అధ్యక్షుడు మరియు జేఎన్యూ ప్రొఫెసర్) మాట్లాడుతూ ప్రైవేట్ అంతర్జాతీయ న్యాయం పబ్లిక్ అంతర్జాతీయ న్యాయంతో సంబంధం ఉన్నప్పటికీ, అది స్వతంత్ర అధ్యయన రంగంగా పనిచేస్తుందని తెలిపారు. విద్యార్థులు ప్రైవేట్ అంతర్జాతీయ న్యాయం మరియు దేశీయ న్యాయం మధ్య తేడాను స్పష్టంగా అర్థం చేసుకోవడం అత్యవసరం అని ఆయన అన్నారు. ఇది ప్రైవేట్ న్యాయం మరియు అంతర్జాతీయ న్యాయం సంగమంలో ఉండి, దేశ సరిహద్దులను దాటి ఉత్పన్నమయ్యే న్యాయ సమస్యలను పరిష్కరిస్తుందని వివరించారు. మరొక అతిధి మణిముత్తు గాంధీ (ఇండియన్ సొసైటీ ఆఫ్ ఇంటర్నేషనల్ లా ఉపాధ్యక్షులు) మాట్లాడుతూ సంస్థ అకాడమిక్ ప్రతిభ మరియు అంతర్జాతీయ భాగస్వామ్యంపై ఉన్న కట్టుబాటును హైలైట్ చేశారు. ఈ సదస్సు ప్రపంచ ప్రాధాన్యత కలిగిన సమకాలీన న్యాయ సమస్యలపై సార్థక చర్చలను ప్రోత్సహించడానికి మా అంకితభావాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. సాంకేతిక మార్పుల నేపథ్యంలో ప్రైవేట్ అంతర్జాతీయ న్యాయంపై పరిశోధన మరియు చర్చలను ముందుకు తీసుకెళ్లడంలో ఈ సదస్సు ఒక ముఖ్యమైన అడుగు అని తెలిపారు. విఐటి -ఏపీ విశ్వవిద్యాలయ వైస్-చాన్సలర్ డా॥ పి. అరుళ్మొళి వర్మన్ మాట్లాడుతూ అకాడమిక్ రంగం న్యాయ చర్చలను తీర్చిదిద్దడంలో పోషించే పాత్రను వివరించారు. విశ్వవిద్యాలయాలు సిద్ధాంతం మరియు ఆచరణ మధ్య వారధిగా పనిచేస్తాయి. ఇలాంటి సదస్సులు గ్లోబల్ న్యాయ అభివృద్ధికి విలువైన సూచనలు అందిస్తాయని పేర్కొన్నారు. నేటి డిజిటల్ యుగంలో సరిహద్దు దాటి జరిగే లావాదేవీలు మరియు వేగంగా మారుతున్న సాంకేతికత వల్ల కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా, వివిధ దేశాల న్యాయ వ్యవస్థల మధ్య అనుసంధాన లోపం ఒక ప్రధాన సమస్యగా నిలుస్తోంది. దీనికి అంతర్జాతీయ సహకారం మరియు సృజనాత్మక న్యాయ ఆలోచన అవసరం అని అన్నారు. డా. బెనర్జీ చక్కా (డీన్, విఐటి-ఏపి స్కూల్ ఆఫ్ లా) మాట్లాడుతూ, వేగంగా డిజిటలైజ్ అవుతున్న ప్రపంచంలో ప్రైవేట్ అంతర్జాతీయ న్యాయ ప్రాముఖ్యత పెరుగుతోందని అన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికత ప్రపంచ పరస్పర చర్యలను మారుస్తున్న నేపథ్యంలో, సరిహద్దు దాటి వచ్చే సవాళ్లను స్పష్టతతో మరియు ముందుచూపుతో ఎదుర్కొనే విధంగా న్యాయ వ్యవస్థలు అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా॥బెన్నా సి. షాజీ (సదస్సు కన్వీనర్), విఐటి-ఏపి స్కూల్ ఆఫ్ లా అధ్యాపక బృందం, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మంగళగిరిలో రెండు రోజుల ఫ్యాన్ పార్క్

## - జూన్ 5 నుంచి ఆంధ్రా ప్రీమియర్ లీగ్

## - రాజ్యసభ సభ్యులు ఎంపీ సానా సతీష్ బాబు









**మంగళగిరి, (రాజధాని వార్తలు):** క్రికెట్ అభిమానులకు ప్రత్యేకంగా మంగళగిరిలో రెండు రోజుల పాటు ఫ్యాన్ పార్క్‌ను నిర్వహిస్తున్నట్లు రాజ్యసభ సభ్యులు ఎంపీ సానా సతీష్ బాబు తెలిపారు. బీసీసీఐ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరి Apiic భవనం దగ్గర్లో ఉన్న ఫ్యాన్ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఫ్యాన్ పార్క్‌లో మొత్తం నాలుగు మ్యాచ్‌లను అభిమానులు ఉచితంగా వీక్షించే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. రేపు దిల్లీ - పంజాబ్, రాజస్థాన్ - హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌లు ప్రదర్శించబడతాయి. ఎల్లుండి గుజరాత్ - చెన్నై, లఖ్‌నవూ - కోల్‌కతా జట్ల మధ్య మ్యాచ్‌లు ప్రసారం చేయబడతాయని చెప్పారు. స్టేడియంలో ప్రత్యక్షంగా మ్యాచ్ వీక్షిస్తున్న అనుభూతిని ప్రేక్షకులకు అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఫ్యాన్ పార్క్ కార్యక్రమాలు స్టార్ స్పోర్ట్స్‌లో కూడా ప్రత్యక్ష ప్రసారం అవుతాయని తెలిపారు. మంత్రి నారా లోకేష్ చొరవతో ఈ కార్యక్రమం నిర్వహణ సాధ్యమైందని ఎంపీ పేర్కొన్నారు. అలాగే, మంగళగిరి ప్రీమియర్ లీగ్‌లో 120 జట్లు పాల్గొనడం విశేషమని చెప్పారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇంకా, మంగళగిరి స్టేడియంలో జూన్ 5 నుంచి ఆంధ్రా ప్రీమియర్ లీగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మంగళగిరిని అన్ని రకాల క్రీడలకు వినూత్న కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీ సానా సతీష్ బాబు స్పష్టం చేశారు.


# రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షునిగా చిలకా విజయ్



**రాయపూడి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షునిగా చిలకా విజయ్ కుమార్‌ను ఆ పార్టీ అదిష్టానం నియమించింది ఈ సందర్భంగా ఏఐసీసీ ఏపీసీసీ అధ్యక్షులకు, ఏఐసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షులకు ఇఛార్జ్‌లకు, పార్టీ సీనియర్లకు కృతజ్ఞతలు తెలిపారు. విజయ్ మాట్లాడుతూ ఎస్సీలను రాష్ట్రంలో అన్ని పార్టీలు ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని దేశంలో రోజు రోజుకు దళితుల మీద వివక్ష దాడులు ఎక్కువయ్యాయని వాటిని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ఎస్సీ విభాగాన్ని యువ రక్తంతో నింపుతానని విజయ్ తెలిపారు. 22 సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ ప్రయాణంలో పార్టీ ఏ భాద్యత అప్పగించినా శక్తి వంచన లేకుండా పని చేశానని ఇప్పుడు కూడా రాష్ట్రంలో ఎస్సీ సెల్ బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని విజయ్ తెలిపారు.

# ఏపీ సిఆర్డీఏ అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్





**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రజారాజధాని అమరావతి-రాయపూడిలోని ఏపీ సిఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ఏప్రిల్ 23, 2026వ తేదీ గురువారం ఉదయం జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ ఐఏఎస్ అడిషనల్ కమిషనర్ (ఫుల్ అడిషనల్ ఛార్జ్-FAC)గా బాధ్యతలు చేపట్టారు. CRDA ప్రధాన కార్యాలయం 1వ ఫ్లోర్‌లోని ఛాంబర్‌లో ప్రవీణ్ చంద్ బాధ్యతలు స్వీకరించారు. రాయపూడిలోని కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు తొలుత APCRDA కమ్యూనికేషన్స్ విభాగ జాయింట్ డైరెక్టర్ జి.రామరాజు స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రవీణ్ చంద్‌కి సిఆర్డీఏ కమిషనర్ వి.విజయరామరాజు ఐఏఎస్, అడిషనల్ కమిషనర్లు ఏ.భార్గవతేజ ఐఏఎస్, కొల్లాబత్తుల కార్తీక్ ఐఏఎస్, ఆఫీస్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ వల్లభనేని శ్రీనివాసరావు, HR విభాగ డైరెక్టర్ బి.మల్లికార్జున రెడ్డి, ఇతర ముఖ్య అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

# రెండో పంటకు కూడా సాగునీరు.. కానీ నీటి పొదుపు తప్పనిసరి

**- సాగునీటి కాలువల్లో కాలుష్యం జలాలు వదిలే అక్రమ చేపల చెరువులపై కఠిన చర్యలు తీసుకోండి - సాగునీటి నిర్వహణలో కీలక పాత్ర పోషించే లస్కర్ల జీతాలు వెంటనే చెల్లించండి - సూపర్ ఎల్నినో ముప్పు నేపథ్యంలో నీటి పొదుపు పాటించండి - నీటి పన్ను బాకీల వసూళ్లపై రెవెన్యూ శాఖ దృష్టి సారించాలి : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** 1973లో 3.45 టిఎంసిల సామర్థ్యం ఉన్న కనిగిరి రిజర్వాయర్ గత 50 ఏళ్లలో పూడిక కారణంగా నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోయిందన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. నెల్లూరు నగరంలోని జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో జరిగిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ కనిగిరి రిజర్వాయర్ పునరుద్ధరణకు 48 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి చంద్రబాబు నాయుడుకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయని రెండో పంటకు కూడా నీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెల్లడించారు. అయితే వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న సూపర్ ఎల్నినో ప్రభావం వల్ల ఈ ఏడాది తీవ్రమైన ఎండలు ఉండే అవకాశం ఉన్నందున అధికారులు మరియు సాగునీటి సంఘ నాయకులు మరియు రైతు సంఘాల నాయకులు సమన్వయంతో పనిచేసి నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కనిగిరి రిజర్వాయర్ నుండి రామతీర్థం వరకు ఉన్న 1 లక్ష 10 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందాలంటే లస్కర్ల పాత్ర కీలకమని ప్రస్తుతం ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న వారికి పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే విడుదల చేయాలని జిల్లా కలెక్టర్ మరియు ఇరిగేషన్ ఉన్నతాధికారులను కోరారు. సంగం బ్యారేజ్ ఆధునీకరణ నేపథ్యంలో కనిగిరి మెయిన్ కెనాల్ ద్వారా రిజర్వాయర్‌కు ధామాషా ప్రకారం నీటి కేటాయింపులు జరగాలని డిమాండ్ చేశారు. మరోవైపు, సాగునీటి కాలువల వెంబడి అక్రమంగా చేపల చెరువులు ఏర్పాటు చేసి, కలుషిత నీటిని కాలువల్లోకి వదలడంపై ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు.
దీనివల్ల సాగునీటి నాణ్యత దెబ్బతింటోం దని ఇటువంటి అక్రమ చర్యలపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో నీటి పన్ను వసూ ళ్లపై రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోందని ఆమె అసహనం వ్యక్తం చేశారు. దాదాపు 38 కోట్ల బకాయిలు ఉండగా కేవలం 2 కోట్ల 88 వేల రూపాయలు మాత్రమే వసూలయ్యాయని నీటి పన్ను వసూళ్లను వేగవంతం చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవా లని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి కోరారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిలతో పాటు ఇరిగేషన్ అధికారులు, పెన్నా డెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి జిల్లాలోని ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# టిడిపి నాయకుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి




**విడవలూరు, (రాజధాని వార్తలు):** విడవలూరు మండలం దండిగుంట గ్రామంలో అనారోగ్య కారణాలతో మృతి చెందిన వరిణి వ్యవ సాయ సహకార సొసైటీ సభ్యురాలు కుడుముల రమణమ్మ, మరో తెలుగుదేశం పార్టీ కార్యకర్త కుడుముల రాము కుటుం బాలను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పరామర్శిం చారు. దండిగుంట గ్రామంలోని మృతుల నివాసాలకు వెళ్లిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి రమణమ్మ మరియు రాము చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కష్టకాలంలో పార్టీ మరియు తాను అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రమణమ్మ సొసైటీ సభ్యురాలిగా చేసిన సేవలను, రాము పార్టీ పట్ల చూపిన నిబద్ధతను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



# విడవలూరు కామాక్షీ నగర్‌లో ఏకొల్లు సుశీలమ్మ నేత్రదానం

**విడవలూరు, (రాజధాని వార్తలు):** మన సేవా సంస్థ అధినేత దేవేళ్ల శ్రీనివా సులు రెడ్డి చొరవతో ఏకొల్లు సుశీలమ్మ నేత్రాన్ని దానం చేసారు. కుటుంబ సభ్యులు అనుమతి మేరకు నేత్ర దానం జరిగింది. బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందగా ఆమె నేత్రాలను మనసేవా సంస్థ సహకారంతో నెల్లూరు జిల్లా ప్రభుత్వ హాస్పిటల్‌కి దానం చేసిన కుటుంబ సభ్యులు నేత్రాలను ఐ టెక్నీషియన్ సునీల్ సేకరించినారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కోవూరు మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆకస్మిక తనిఖీ

**- వేసవి సెలవుల అనంతరం పాఠశాల పునః ప్రారంభం అయ్యేలోపు ప్రైమరీ స్కూల్‌లో మౌలిక సదుపాయాల కల్పన - ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తక్షణ స్పందన పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం**




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విద్యా వ్యవస్థ బలోపేతం, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. కోవూరు పట్టణంలోని మోడల్ ప్రైమరీ స్కూల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను, పరిసరాలను ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల భవన స్లాబ్ దెబ్బతిన్న విషయాన్ని, సరైన వంట గది లేని ఇబ్బందులను ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. శిథిలావస్థకు చేరి ఉన్న స్లాబ్‌కు తక్షణమే మరమ్మత్తులు చేయిస్తామని ప్రకటించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండేందుకు వీలుగా ఆధునిక వసతులతో కూడిన కిచెన్ షెడ్ నిర్మిస్తామని తెలిపారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాల పునః ప్రారంభం అయ్యేలోపు పనులన్నీ పూర్తి చేసి మౌలిక సదుపాయాల సమస్య పరిష్కరిస్తానన్నారు. పాఠశాల ఆకస్మిక తనిఖీ చేసి మౌలిక సదుపాయాల కల్పనపై ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తక్షణ స్పందన పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమాలో స్థానిక టిడిపి ముఖ్య నాయకులతో పాటు మోడల్ ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ కె భారతి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో చిన్నారి రెహాన్ ఖాన్ మృతి - నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ




**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు పట్టణంలోని మసీదు వీధికి చెం దిన పఠాన్ జబీవుల్లా ఖాన్ కుమారుడు ఐదేళ్ల రెహాన్ ఖాన్ చికిత్స కోసం వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోవూరులోని వారి నివాసంలో చిన్నారి రెహాన్ ఖాన్ భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. జబీవుల్లా ఖాన్ కుమారుడు రెహాన్ ఖాన్ గత కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మానవత్వంతో స్పందించి చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి అధికారులతో మాట్లాడి తక్షణమే 3 లక్షల రూపాయల ఎల్‌ఓసి మంజూరు చేయించి జబివుల్లా కుటుంబానికి అండగా నిలిచారు. అయితే చికిత్స నిమిత్తం ఆటోలో ఆసుపత్రికి వెళ్తుండగా ఊహించని విధంగా రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్నారి రెహాన్ ఖాన్ మృతి చెందాడు. అదే ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన తండ్రి జబీవుల్లా ఖాన్ ప్రస్తుతం చెన్నైలోని ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారు. చిన్నారి మరణవార్త విన్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారి రెహాన్‌ను కాపాడుకోవాలని అన్ని ప్రయత్నాలు చేశాం కానీ ఇలాంటి ప్రమాదం జరగడం చాలా దురదృష్టకరమన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని జబీవుల్లా ఖాన్ త్వరగా కోలుకోవాలని ఆమె ఆకాంక్షించారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడమే కాకుండా భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోవూరు టిడిపి ముఖ్య నాయకులతో పాటు పలువురు మైనారిటీ నాయకులు కూడా పాల్గొన్నారు.

# ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు

**- లక్ష్యం ఉంటే ఏదైనా సాధ్యమే : జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత**



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం భగీరథ మహర్షి జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెవిన్యూ అధికారి కె. హేమలత అధ్యక్షత వహించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి డిఆర్‌ఓ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్యం ఉంటే ఏదైనా సాధ్యమేనని, విద్యార్థులు తమ జీవితంలో ఎంతటి కష్టమైన పనినైనా పట్టుదలతో సాధించాలని, అసాధారణ పట్టుదలతో గంగను భూమికి రప్పించిన భగీరథుని కృషి చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. అసాధ్యమైన పనిని సుసాధ్యం చేసిన భగీరథ మహర్షి త్యాగం, పట్టుదల నేటి యువతకు మరియు రాబోయే తరాలకు గొప్ప ఆదర్శం. సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. భగీరథుని 'భగీరథ ప్రయత్నం' అనే పదం పట్టుదలకు మారుపేరుగా మారిందని, అదే స్ఫూర్తితో ప్రభుత్వ లక్ష్యాల సాధనలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. అంతేకాకుండా, ఈ సందర్భంగా నీటి సంరక్షణ ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ, ప్రతి ఒక్కరూ నీటి వనరులను కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి.సి వెల్ఫేర్ అధికారి అప్పన్న, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్ సింగ్, కొప్పులవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొట్టాపు వెంకట నాయుడు, నాగవంశం డైరెక్టర్ హనుమంతు శంకర రావు, డైరెక్టర్ ఉరిటి యాదవ్ తదితరులు ఉన్నారు.

# జర్నలిస్టులకు సంపూర్ణ సహకారం

**- హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లింపు పరిశీలిస్తా - పెండింగ్ సమస్యలు సత్వరం పరిష్కరిస్తా - ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ నేతలతో జిల్లా కలెక్టర్ అభిసిక్త్ కిషోర్**





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టులకు తమ వంతు సంపూర్ణ సహకారం అందిం చడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అభిసిక్త్ కిషోర్ అన్నారు. గురువారం ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ బ్రాడ్ కాస్ట్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్లకు చెందిన పలువురు జర్నలిస్టు నేతలు జిల్లా కలెక్టర్ ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఎన్ఏజే ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణలు జర్నలిస్టులకు సంబంధించిన పలు అంశాలను జిల్లా కలెక్టర్ కు విపులంగా వివరించారు. జిల్లాలో జర్నలిస్టులందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం సిఎస్ఆర్ నిధు లతో జిల్లా అధికార యంత్రాంగం ద్వారా చెల్లించాలని కోరారు. గతంలో కూడా పలువురు కలెక్టర్లు ఈ విధంగానే చెల్లించారని వీరు తెలియజేశారు. ఇందులో వెటరన్ జర్నలిస్టులను కూడా పరిగణలోకి తీసుకోవాలని వీరు కోరారు. ఈ విషయంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు గంట్ల శ్రీను బాబు నారాయణలు తెలిపారు. అలాగే పెండింగ్ అక్రిడేషన్లు ఇతర అంశాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని తాము కోరడం జరిగిందన్నారు. జర్నలిస్టుల అన్ని పెండింగ్ సమస్యలను తెలుసుకుని దశలవారీగా పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడం జరిగింది అని వీరు చెప్పారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు జర్నలిస్టు నేతలు కలెక్టర్‌కు సింహాద్రి నాథుడి జ్ఞాపిక అందించి ఘనంగా సత్కరిం చారు.

అలాగే ఏపీ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ రాష్ట్ర డైరీని జిల్లా అధ్యక్షులు నారాయణ కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్ర మంలో బ్రాడ్ కాస్ట్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు కార్యదర్శి కింతాడ మదన్, చిన్న మధ్యతరహా పత్రికల సంఘం అధ్యక్షులు జగన్మోహన్, బొబ్బర ప్రసాద్, ఫెడరేషన్ ఉపాధ్యక్షులు ఎన్.రామ క్రిష్ణ, పి.నగేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# పల్లెపల్లెన ఆధ్యాత్మిక శోభ

**- రెండేళ్లలో 5 వేల ఆలయాల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం - టీటీడీ - శ్రీవాణి ట్రస్టు ద్వారా నూతన ఆలయాలకు ఇచ్చే నిధులు భారీగా పెంపు - మంత్రి ఆనం నాయకత్వంలో దేవాదాయ శాఖకు కొత్త రూపు**





**తోటపల్లి గూడూరు, (రాజధాని వార్తలు):** టీపీ గూడూరు మండలం తోట పల్లిలో శ్రీ కోదండరామస్వామి ఆలయ శంకుస్థాపన మహోత్స వంలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. చలమయ్య, కృష్ణయ్యల తాత వందేళ్ల క్రితమే ఆలయ నిర్మాణం చేశారు. ఆ కుటుంబ సభ్యులే ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు గ్రామస్తులు రూ.33 లక్షలు సమకూ ర్చుకోగా, సీజేఎఫ్ కింద రూ.66 లక్షలు మంజూరు చేయించామని చెప్పారు. రూ.1 కోటితో అద్భుతమైన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ఆనందదాయకం కూటమి ప్రభుత్వం వచ్చాక దేవస్థానాల నిర్మాణాల విషయంలో రాజీ లేకుండా నిధులు మం జూరు చేస్తున్నామని అన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా నూతన ఆలయాల నిర్మాణానికి ఇచ్చే నిధులను భారీగా పెంచారు 5 నుంచి 7 సెంట్ల స్థలం ఉంటే రూ.20 లక్షలు, 9 నుంచి 12 సెంట్ల వరకు రూ.30 లక్షలు, 15 సెంట్ల పైన ఉంటే రూ.40 లక్షలు మంజూరు చేయనున్నారు. రెండేళ్లలో 5 వేల ఆలయాల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. కామన్ గుడ్ ఫడ్ కింద కూడా భారీగా నిధులు ఇస్తోంది. భక్తులు రూపాయి ఇస్తే, దేవాదాయ శాఖ రెండు రూపాయలు కలిపి నిధులు ఇస్తోందన్నారు.

ప్రతి దేవాలయంలో దూపదీప నైవేద్యాలు, కైంకర్యాలకు నెలకు రూ.10 వేలు అందిస్తున్నామని అన్నారు. ఆనం రామనారాయణ రెడ్డి సారథ్యంలో దేవాదాయ శాఖలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని సోమిరెడ్డి కొనియాడారు. శ్రీ కోదండరాముడి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కోరుకుంటున్నా, ప్రత్యేకంగా గిరిజనులపై ఎక్కువగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికా రులు, స్థానిక టీడీపీ కూటమి నేతలు, స్థానిక భక్తులు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# దళిత ద్రోహి అనంత బాబును వెంటనే అరెస్ట్ చేయాలి

**- హంతకులకు జగన్ రెడ్డి 'అనంత' ప్రేమ.. దళితులపై దాడులు ఆపాలి...అమలాపురంలో ఎస్సీ సెల్ నిరసన**



**అమలాపురం, (రాజధాని వార్తలు):** దళిత డ్రైవర్ వీధి సుబ్రహ్మ ణ్యంను అత్యంత కిరాతకంగా చంపిన ఎమ్మెల్సీ అనంతబాబును వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ అమలాపురం నియో జకవర్గం టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు ఈత కోట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. అమలాపురం పార్క్ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద టిడిపి ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టి జగన్ మోహన్ రెడ్డి పాలనలో దళితులపై అరాచ కాలు, దాడులు పెరిగిపోయాయని దళితుల రక్తం పీల్చి వారి భూములను దోచుకున్నారని నాగేశ్వరరావు మండిపడ్డారు. ఎన్నికల సమయంలో మాత్రమే దళితులు గుర్తుకు వచ్చే జగన్ రెడ్డికి వారి ప్రాణాల కంటే హంతకుడైన అనంతబాబే ముఖ్యమై పోయారని విమర్శించారు. 2022 మే 19 రాత్రి తన వద్ద డ్రైవ ర్‌గా పనిచేసిన సుబ్రహ్మణ్యంను అనంతబాబు కారులో తీసుకెళ్లి తీవ్రంగా కొట్టి చంపడమే కాకుండా ఆ మృతదేహాన్ని వారి ఇంటి వద్దే 'డోర్ డెలివరీ' చేసి దానిని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. అప్పటి పోలీసులు నిందితుడితో కుమ్మక్కై సాక్ష్యాలను తారుమారు చేశారని సిట్ విచారణలో సుబ్రహ్మణ్యం శరీరంపై 31 గాయాలు ఉన్నట్లు తేలిందని వివరిం చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ కేసులో అసలు నిజాలు బయటపడుతున్నాయని అనంతబాబు భార్య లక్ష్మీదుర్గ ప్రమేయం ఈ హత్యలో ఉందని సాక్ష్యాలతో సహా రుజువైందని తెలిపారు. సాక్షులకు డబ్బు ఆశ చూపించి బెదిరిం పులకు పాల్పడు తున్న అనంతబాబుపై సుప్రీంకోర్టు సైతం ఆగ్రహం వ్యక్తం చేసిందని నాగేశ్వరరావు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దళితుల ప్రాణాలను బలి తీసుకుంటున్న ఇటువంటి నేరస్తులను కఠినంగా శిక్షించాలని అనంతబాబును తక్షణమే అరెస్టు చేయాలని అమలాపురం ఎస్సీ సెల్ నాయకులు డిమాండ్ చేశారు. దళిత ద్రోహి అనం తబాబుకు బేడీలు వేయాలని రాష్ట్ర టిడిపి ఎస్సీ సెల్ ఉపధ్యక్షులు పొలమూరి ధర్మపాల్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల సాయి, కుంచె వెంకన్న బాబు, నామాడి తారక్, దేవరపల్లి శాంతకుమార్, అయితాబత్తుల శ్రీనివాసరావు, కుంచె రమేష్, పోతుల బుజ్జి, నామాడి శ్రీను, కాట్రు శ్రీను, కాశి వెంకట్రావు, నూరుకుర్తి ప్రదీప్ కుమార్, గోసంగి ఆనందరావు, విప్పర్తి రమణ, నక్కా తులసి అంబేద్కర్, నాగబత్తుల బాలసుబ్బారావు, మందా రాఘవ, పులపర్తి నాని తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఐపీఎస్ అధికారుల బదిలీలు : కీలక నియామకాలు

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభా గంలో భారీ స్థాయిలో ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. పాలనను మరింత వేగవంతం చేయడంతో పాటు, కొత్తగా ఏర్ప డుతున్న విభాగాలకు అనుభవజ్ఞులైన అధికారులను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ అధికారులకు కీలక బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో అత్యంత ప్రాధాన్యం కలిగిన హోం శాఖ, కొత్తగా అభివృద్ధి చెందుతున్న 'ఫ్యూచర్ సిటీ' కమిషనరేట్ నియామకాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ప్రభుత్వం చేపట్టిన ఈ బదిలీలు పోలీస్ యంత్రాంగంలో కొత్త ఉత్సాహాన్ని నింపను న్నాయి. ముఖ్యంగా హోం శాఖ, విజిలెన్స్ విభాగాల్లో సీనియర్ల నియామకం ద్వారా పాలనలో మరింత పారదర్శకత వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

**కీలక అధికారులకు కొత్త బాధ్యతలు..**

శిఖా గోయల్‌కు హోం శాఖ ప్రధాన కార్యదర్శి, దేవేంద్ర సింగ్ చౌహాన్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ, డా. తరుణ్ జోషి ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్, బి.సుమతి మల్కాజిగిరి పోలీస్ కమిషనర్, అవినాశ్ మొహంతి డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ, షానవాజ్ ఖాసిం మల్టీజోన్-2 ఐజీపీ, కార్తికేయ ఐజీపీ ఎస్ఐబీ ఇంటెలిజెన్స్ (అదనపు బాధ్యతలు)

**హోం శాఖ ప్రధాన కార్యదర్శిగా శిఖా గోయల్..**

ప్రధాన మార్పుల్లో భాగంగా శిఖా గోయల్‌ను హోం శాఖ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఇది అత్యంత కీలక పరిపాలనా బాధ్యతగా పరిగణించింది.


**విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్**

దేవేంద్ర సింగ్ చౌహాన్‌ను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా నియమించింది. అవినీతి నిరోధక చర్యలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభా గాల పర్యవేక్షణ ఆయన బాధ్యతల్లోకి వస్తాయి.

**మల్టీజోన్, ఇంటెలిజెన్స్ విభాగాలు..**

షానవాజ్ ఖాసింను మల్టీజోన్-2 ఐజీపీగా బదిలీ చేశారు. అదే విధంగా కార్తికేయకు ఎస్ఐబీ (ఇంటెలిజెన్స్) అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇది రాష్ట్ర ఇంటెలిజెన్స్ వ్యవస్థలో కీలక మార్పుగా భావిస్తోంది.

**డ్రగ్స్ కంట్రోల్ విభాగం**




అవినాశ్ మొహంతిని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీగా నియ మించింది. మాదకద్రవ్యాల నియంత్రణ, డ్రగ్స్ రాకెట్‌లపై చర్యలు ఆయన ప్రధాన బాధ్యతగా ఉంటాయి.

**పోలీస్ కమిషనర్ నియామకాలు**

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌గా తరుణ్ జోషిను నియమిం చింది. అదే విధంగా బి.సుమతిను మల్కాజిగిరి పోలీస్ కమిషన ర్‌గా నియమించింది.

**ఫ్యూచర్ సిటీ కమిషనర్ మార్పు**

రిటైర్‌మెంట్ నేపథ్యంలో సుధీర్ బాబు స్థానంలో తరుణ్ జోషికి ఫ్యూచర్ సిటీ సీపీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ బదిలీలు తెలంగాణ పోలీసు వ్యవస్థలో పెద్ద స్థాయి పునర్వ్యవ స్థీకరణగా కనిపిస్తున్నాయి. కీలక విభాగాల్లో కొత్త అధికారులను నియమించడం ద్వారా పరిపాలనను మరింత సమర్థవంతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో జరిగిన ఈ సీనియర్ ఐపీఎస్ బదిలీలు పోలీసు శాఖలో కొత్త సమీకరణాలను తీసుకువచ్చాయి. కీలక విభాగాల్లో కొత్త నేతృత్వం రావడంతో రాబోయే రోజుల్లో పాలన, భద్రతా వ్యవస్థలో మరింత వేగం వచ్చే అవకాశం ఉంది.

# ఓడలరేవు బీవీసీలో ఐఈఈఈ ఎలక్ట్రాన్ డివైజెస్ సొసైటీ ప్రారంభం

**అల్లవరం, (రాజధాని వార్తలు):** ఓడల రేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఐఈఈఈ ఎలక్ట్రాన్ డివైజెస్ సొసైటీ ప్రారంభోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఎలక్ట్రాన్ డివైజెస్ సొసైటీ ద్వారా విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించే ఉ ద్దేశంతో ఈ చాప్టర్‌ను కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ వి.మధు ముఖ్య అతిథిగా పాల్గొని ఇటువంటి అంతర్జాతీయ సంస్థలలో సభ్యత్వం కలిగి ఉండడం ద్వారా విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను మధు సవివరంగా వివరించారు.ఎలక్ట్రాన్ డివైజెస్ సొసైటీ ఏర్పాటు ద్వారా కలిగే ప్రయోజనాలు.

**నైపుణ్యాభివృద్ధి :**

సర్క్యూట్ డిజైనింగ్ మరియు డెవలప్‌మెంట్ సామర్థ్యాన్ని పెంచుకోవడం.

సాంకేతిక పరిజ్ఞానం: మారుతున్న కాలానికి అనుగుణంగా ఎలక్ట్రానిక్ రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలపై పట్టు సాధించడం.

గ్లోబల్ నెట్‌వర్కింగ్: కూడా అంతర్జాతీయ కంపెనీలతో సంబం ధాలు ఏర్పరచుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును నిర్మించు



కోవడం వంటి అంశాల గురించి ఆయన విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని సాంకేతిక రంగంలో రాణించాలని ఆయన కోరారు. కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ బోనం కనకదుర్గ, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.ఎన్.ఎస్.ఆర్. రత్నా కరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. ప్రవీణ్‌లు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఎ యేసు ప్రసాద్, డాక్టర్ ఎస్.శ్రీకాంత్, డాక్టర్ టి.శరన్ కుమార్ ఇతర అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయ సాధనే ధ్యేయంగా ముందుకు సాగాలి : ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం, (రాజధాని వార్తలు):** భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయ సాధనకు ఆయన చూపిన బాటలో నడవాలని అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు పిలుపునిచ్చారు. ఉప్పలగుప్తం మం డలం ఎస్. యానాం జల్లివారిపేటలో నిర్వహించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లా డారు. బాబాసాహెబ్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమాజంలో అణగా రిన వర్గాల అభ్యున్నతికి, సామాజిక సమానత్వం కోసం అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. రాజ్యాంగం ద్వారా ఆయన కల్పిం చిన హక్కులు నేడు ప్రతి సామాన్యుడికి రక్షణ కవచంలా నిలుస్తున్నాయని విద్య ద్వారానే మార్పు సాధ్యమని ఆయన నమ్మేవారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం బాబా సాహెబ్ అడుగుజాడల్లో నడుస్తూ సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తోందని నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందజేయడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. జల్లివారిపేట అభివృద్ధికి స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్య కర్తలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## గంగ, కావేరి.. నడుమ 'నారీశక్తి'!

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిగూఢ ఆలోచనా పరుడు. ఆయన మనసులో ఏముందో ఎప్పుడూ అర్థం చేసుకోలేం. అందుకు ప్రయత్నిస్తే చిక్కుల నెదుర్కొ వలసి వస్తుంది కూడా. మూడు సంవత్సరాల క్రితమే పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని అమలుపరిచేందుకు, ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న ప్రస్తుత సందర్భంలో ఆయన ప్రభుత్వం ఎందుకు పూనుకున్నది? పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల లబ్ధి పొందేందుకా? పశ్చిమాసియా సంక్షోభంతో వాటిల్లుతోన్న ఆర్థిక బాధల నుంచి ప్రజల ఆలోచనలను మళ్లించేందుకా? మహిళా ఉద్ధారకుడుగా తనకు ఉన్న సువిఖ్యాతిని మరింతగా సుప్రతిష్ఠితం చేసుకునేందుకా? ఉద్దేశం ఏదైనా కావచ్చుగానీ రాజకీయ పర్యవసానాలు చాలా ప్రముఖమైనవి. చట్టసభలలో మహిళలకు ప్రాతినిధ్యం విషయమై ప్రారంభమైన చర్చ మరింత వివాదాస్పదమైన విషయానికి మళ్లింది- డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన). ఈ వివాదాస్పద అంశం మళ్లీ చర్చల్లోకి రావడంతో ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య వ్యత్యాసాలు, విభేదాలు, విభజనల వ్యవహారాలు మళ్లీ ప్రజల మాటామంతీలోకి వచ్చాయి. నియోజక వర్గాల పునర్విభజన ప్రక్రియ దక్షిణాది రాష్ట్రాలకు ప్రతికూలంగా అమలయితే మున్నెన్నడూలేని రీతిలో ఆందోళనలు ప్రజ్వరిల్లుతాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల పోరులో తలమునకలై ఉన్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సైతం అటువంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. ఇది రాజకీయ వ్యాకులతా? లేక వ్యవస్థాగతమైన ఆందోళనకు ప్రతిబింబమా? రెండూ అని చెప్పితీరాలి. ఇది ఇబ్బందికరమైన సమాధానం, సందేహం లేదు. అంకెలతో ఆరంభమవుదాం. గత ఐదు దశాబ్దాలలో దక్షిణాదిలో కంటే ఉత్తర భారతావనిలో జనాభా పెరుగుదల చాలా వేగంగా జరిగింది. ప్రజారోగ్యం, విద్య, కుటుంబ నియంత్రణ రంగాలలో దక్షిణాది రాష్ట్రాలు మొదటి నుంచీ నిధులు భారీగా వినియోగించి జనాభా పెరుగుదలను నియంత్రించాయి. ఈ విషయంలో హిందీ భాషా రాష్ట్రాలు వెనుకబడిపోయాయి. రాజ్యాంగం నిర్దేశించినట్టు జనాభా గణన ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య 2026 జనాభా గణన అనంతరం తగ్గిపోతుంది. ఇది జనాభా వాస్తవికతే గానీ రాజకీయ ఆక్షేపణ కానే కాదు. అసలు సమస్య రాజకీయాలలోను, విశ్వాసంలోను ఉన్నది. ఇది ఒక విధంగా విశ్వాస లోపరుగ్మత అని చెప్పి తీరాలి. అన్ని రాష్ట్రాలలోను లోక్‌సభ సీట్లు 50శాతం మేరకు పెంచుతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రతిపాదించారు. ఏ రాష్ట్రమూ ఏ విధంగా నష్టపోకుండా ఉండేందుకు అది ఆచరణ సాధ్యమైన రాజీకి ప్రాతిపదిక అయివుండదగింది. అయితే అమిత్ షా ప్రతిపాదన చాలా ఆలస్యంగా వచ్చింది. పైగా ప్రతిచర్యాత్మకమైనదిగా కనిపించింది. విస్తృతస్థాయి సంస్కరణలకు పూనుకున్నప్పుడు సంబంధిత వ్యక్తులు అందరితో ఓర్పుగా, నేర్పుతో సంప్రదింపులు జరిపి ఆ ప్రక్రియకు సార్వత్రిక సమ్మతి, విశ్వసనీయతను సాధించవలసి ఉన్నది. అయితే మోదీ ప్రభుత్వం సరిగ్గా ఈ విషయంలోనే తప్పటడుగు వేసింది. ముందుగా ముఖ్యమంత్రులతో సహా అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి చర్చించలేదు. అలా ప్రజాస్వామికంగా వ్యవహరించకుండా మహిళా రిజర్వేషన్ అమలుపై ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని ఆ తరువాత ఆ నిర్ణయాన్ని రాజకీయ పక్షాలకు, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేసింది. మనది ఒక సమాఖ్య వ్యవస్థ. ఏ సమాఖ్య వ్యవస్థలో అయినా తమ నిర్ణయాలను ప్రతిపక్షాలు ఎలా అవగాహన చేసుకుంటున్నాయన్న విషయాన్ని ప్రభుత్వం తప్పక దృష్టిలో పెట్టుకోవాలి. సమాఖ్య వ్యవస్థలో బహుళ అధికార కేంద్రాల మధ్య నిరంతర సంప్రదింపులు, సమన్వయ సహకారాలు అవసరం. ఈ వాస్తవాన్ని మోదీ సర్కార్ విస్మరించింది. మహిళా రిజర్వేషన్ నిర్ణయంపై ప్రభుత్వ కథనం విశ్వసనీయమైనదిగా ప్రతిపక్షాలు భావించలేదు. అయితే ఈ సమస్యను ఉత్తరాది వర్సెస్ దక్షిణాది అనే వైఖరితో చూడడం తప్పుదారి పట్టడమే అవుతుంది. నిశితంగా, నిష్పాక్షికంగా ఆలోచించడంలో మానసిక బద్ధకాన్ని చూపడమేనని కూడా చెప్పవచ్చు. రాజకీయ రంగంలో తమ ప్రాబల్యం ఎలా ఉన్నప్పటికీ దక్షిణాది రాష్ట్రాలు ఇతర రంగాలలో తమ ప్రభావాన్ని బాగా పెంపొందించుకున్నాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే భారతదేశ పురోగతికి అవి చోదకశక్తులుగా ప్రభవించాయి. ఆ స్థానాన్ని నిలబెట్టుకుంటున్నాయి. జీడీపీలో వాటా, ఎగుమతులు, పన్ను ఆదాయాలలో దక్షిణాది రాష్ట్రాలు అగ్రగాములుగా ఉన్నాయి. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ మొదలైన నగరాలు గ్లోబల్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్‌లో అంతస్థగితమయ్యాయి. పార్లమెంటు దేశ జనాభాను ప్రతిబింబిస్తే ఆర్థిక వ్యవస్థ పాలనా దక్షత, ఆర్థిక సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది. మరి ఆర్థిక రంగంలో దక్షిణాది రాష్ట్రాలు చాలా ముందంజలో ఉన్నాయి. మానవాభివృద్ధి, అక్షరాస్యత, ఆరోగ్య భద్రత మొదలైన సామాజిక అభివృద్ధి సూచీలలో కూడా దక్షిణాది రాష్ట్రాలే అగ్రస్థానాలలో ఉన్నాయి. అయితే, ఇప్పుడవి ఒక ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. జనాభా నియంత్రణలో సాధించిన విజయాల కారణంగా పార్లమెంటులో తమ రాజకీయ ప్రాబల్యాన్ని కోల్పోయే విపత్కర పరిస్థితి వాటికి ఏర్పడింది. సుపరిపాలన నందించడంలో తమ విజయానికి శిక్షే ఈ విపత్కర పరిస్థితి అని అవి వాదిస్తున్నాయి. అయితే ఆ వాదనను రాజకీయంగా ఆమోదింపజేయడం అంత తేలికేమీ కాదు. అదే సమయంలో భారతీయ జీవన వాస్తవికత ప్రాంతీయ విభజనలను ప్రతిఘటిస్తోంది. రాజకీయాలు తరచూ ఉపేక్షించే మార్గాలలో సాంస్కృతిక, సామాజిక సమైక్యత మరింత ప్రగాఢమవుతోంది.

# రాష్ట్ర స్థాయిలో జీవీఎంసీకి ప్రతిష్టాత్మక అవార్డు

**- ఆస్తి పన్ను వసూళ్లలో విశాఖ అగ్రగామి నిలిచింది - విశాఖ నగర అభివృద్ధి దిశగా ఆస్తి పన్ను చెల్లింపుదారులు, గృహ యజమానులు, నగర ప్రజల సహకారంతోనే ఈ అవార్డు జీవీఎంసీకి లభ్యం - విజయవాడలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ చేతుల మీదుగా అవార్డు, ప్రశంసా పత్రం స్వీకరణ : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో ఆస్తి పన్ను వసూళ్లలో రికార్డు స్థాయిలో ప్రగతి సాధించినందుకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)కు రాష్ట్ర స్థాయిలో ప్రతిష్టాత్మక అవార్డు, ప్రశంసా పత్రం లభించిందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలియజేశారు. గురువారం విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్-2026 పై నిర్వహించిన రాష్ట్ర స్థాయి కమిషనర్ల వర్క్‌షాప్ సందర్భంగా, 2025-26 ఆర్థిక సంవత్స రానికి గాను ఆస్తి పన్ను వసూళ్లలో మెరుగైన ఫలితాలు సాధించి నందుకు జీవీఎంసీ రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి.సంపత్ కుమార్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన రాష్ట్రస్థాయి అవార్డును, ప్రశంసా పత్రాన్ని జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్ ఎస్ శ్రీనివాసరావుతో కలిసి తను స్వీకరించడమైనదని కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ వివరిస్తూ రాష్ట్ర స్థాయిలో జీవీఎంసీకి ప్రతిష్టాత్మక అవార్డు, ఆస్తి పన్ను చెల్లింపులలో విశాఖ అగ్రగామి నిలిచిందని, ఈ ఘనత విశాఖ నగర అభివృద్ధి దిశగా ఆస్తి పన్ను చెల్లింపుదారులు, గృహ యజమానులు, నగర ప్రజల సహ కారంతోనే ఈ అవార్డు జీవీఎంసీకి లభించిందని, ఈ అవార్డును సాధించినందుకు గాను రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి.సంపత్ కుమార్ జీవీఎం సీని అభినందిస్తూ 2026-27 లో కూడా విశాఖ నగర అభివృద్ధి దిశగా ఆస్తి పన్ను వసూళ్లను, కొత్తగా ఆస్తి పన్ను విధింపులలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టి జీవీఎంసీ ఆర్థిక పరిపుష్టికి, రాష్ట్ర అభివృద్ధికి మరింత ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని వారు పేర్కొ న్నారని కమిషనర్ తెలియజేశారు. 2025-26 ఆర్థిక సంవత్స రంలో జీవీఎంసీ ఆస్తి పన్ను వసూళ్లలో గణనీయమైన పురోగతి సాధించిందని, సుమారు 90 కోట్ల పెరుగుదల లక్ష్యంగా తీసుకుని, అందులో 60 కోట్లు అదనంగా వసూలు చేయడం జరిగిందని, గత ఆర్థిక సంవత్సరంలో 510 కోట్ల వసూళ్లు నమోదు కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 110 కోట్ల వృద్ధితో మొత్తం వసూళ్లు పెరిగి 21.5% వృద్ధి రేటు నమోదు కావడం విశేషమన్నారు. ఈ అవార్డు సాధనకు జీవీఎంసీ అదన కమిషనర్ డివి రమణమూర్తి కార్యాచరణలో జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ ఎస్ శ్రీనివాసరావు నిరంతర పర్యవేక్షణలో రెవెన్యూ విభాగం, ఫీల్డ్ సిబ్బంది, పన్ను చెల్లింపుదారుల సమిష్టి కృషి ఫలితమని పేర్కొన్నారు. నగర అభివృద్ధికి ఆస్తి పన్ను వసూళ్లు కీలకమని, భవిష్యత్తులో మరింత సమర్థవంతమైన చర్యలతో వసూళ్లను పెంచేందుకు కృషి చేస్తామని కమిషనర్ ఈ సంద ర్భంగా తెలిపారు. రాష్ట్రంలో ఆస్తి పన్ను వసూళ్లలో జీవీఎంసీ అగ్రగామిగా నిలవడం పట్ల అధికారులు సంతోషం వ్యక్తం చేశారని, ఈ సందర్భంగా విశాఖ నగర పరిధిలో గల ఆస్తి పన్ను చెల్లింపుదారులు, గృహ యజమానులు, నగర ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలను కమిషనర్ తెలిపారు.

# ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి కృతజ్ఞతాభినందనలు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా వందేళ్ళ పూర్తి చేసుకున్న గుర్తుగా 100 వెండి నాణెం విడుదల చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఉత్త రాంధ్ర రాష్ట్రీయ సమితి మరియు జనసేన తరఫున కృతజ్ఞతాభినందనలు తెలియజేసిన రాజు గౌడ్ యాత. ఈరోజు జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాజు గౌడ్ యాత మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతంలో ప్రతిష్టాత్మకమైన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆంధ్ర యూనివర్సిటీ స్థాపించి 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంలో ప్రధానమంత్రి మోడీ కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర యూనివర్సిటీకి తగిన గుర్తింపు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా రాజు గౌడ్ మాట్లాడుతూ వందేళ్లకు గుర్తుగా రూ.100 వెండి నాణెం ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని రూ. 100 వెండి నాణెం విడుదల చేయనున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ ప్రకటించింది. బుధవారం ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసింది. 35 గ్రాముల బరువు, 44 మిల్లీ మీటర్ల వ్యాసార్ధం ఉండే ఈ నాణేన్ని 50% వెండి, 40% రాగి, 5% నికెల్, 5% జింక్తో రూపొందిస్తున్నారు. నాణేనికి ఒకవైపు సత్యమేవ జయతే అన్న సూక్తితో కూడిన నాలుగు సింహాల అశోక స్తూపం, రూ. 100, హిందీ, ఇంగ్లీష్ లో భారత్, ఇండియా అన్న అక్షరాలు ఉంటాయి. మరోవైపు ఆంధ్ర యూనివర్సిటీ అధికారిక లోగో, దానికి కుడి ఎడమల్లో 1926, 2026 సంవత్సరాలు, ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు అని హిందీ, ఇంగ్లీష్‌లో ఉంటాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు శరన్ గౌడ్, సంపత్ సాయి, కళ్యాణ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆరోగ్యంగా ఉండాలని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ నగర అధ్యక్షులు, సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అదేశాల మేరకు విశాఖ నగర జనసేన పార్టీ నాయకులు, 35వ వార్డు జనసేన ఇంచార్జ్ కోసూరి శ్రీనివాసరావు మరియు విశాఖ నగర జనసేన సీనియర్ నాయకులు రాజు గౌడ్ యాత ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆరోగ్యం ఉండాలని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన పార్టీ శ్రేణులు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ అనారోగ్యం కారణంగా జరిగిన శస్త్ర చికిత్స నుండి త్వరగా కోలుకోని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలో అడుగు పెట్టాలని ఆకాంక్షిస్తూ జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదేశాల మేరకు జనసేన పార్టీ విశాఖ నగర నాయకులు రాజు గౌడ్ యాత మరియు 35వ వార్డు జనసేన ఇంచార్జ్ కోసూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ బీసీ సంఘాల నాయకులు, విద్యార్థి నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

# వేసవి సెలవులు మంజూరు చేసి వేతనాలు పెంచాలి

**- ఎమ్మెల్యే గృహం వద్ద అంగన్వాడీల నిరసన**



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు వేత నాలు పెంచాలని, వేసవి శెలవులు ఇవ్వాలని కోరుతూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో పెద్దాపురం శాసనసభ్యులు ఇంటివద్ద నిరసన తెలిపి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఈ కాలంలో నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, అంగన్వాడీలకు రకరకాల యాప్‌లు తెచ్చి పని భారం పెంచారన్నారు. వేతనాలు పెంచాలని చేసిన అనేక పోరాటాలు ఫలితంగానే 2024 జూలై నెలలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారని, కానీ వాటి గురించి ఈ ప్రభుత్వం ఇంతవరకు పట్టించు కోవడం లేదని తెలిపారు. 2026 మార్చి 2 బడ్జెట్ సమావేశాల సందర్భంగా అంగన్వాడీలకి వేతనాలు పెంచాలని ఇతర సమస్యల పరిష్కారం కోసం చేసిన ఆందోళన ఫలితంగా మార్చి 10వ తారీఖున ఐసిడి ఎస్ మంత్రి వర్యులు అంగన్వాడీ యూనియన్ నాయ కులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రితో మాట్లాడి త్వరలోనే వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని, వాటిని వెంటనే అమలు చేయాలని వారు కోరారు.

కాగా ఎండల తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నాయని, ప్రీ స్కూల్ పిల్లలు రావడానికి అనే ఇబ్బందులు పడుతున్నారని, మే నెల మొత్తం వేసవి సెలవు ఇవ్వాలని వారు కోరారు. హెల్పర్ల ప్రమోషన్లకు ఇచ్చిన గైడ్లైన్స్ జీవో నెంబర్ 5 హెల్పర్లలకు నష్టం చేసే విధంగా ఉందని, ఇంకా పెండింగ్లో కొన్ని మినీ సెంటర్లో అప్ గ్రేడ్ కాకుండా ఆగిపోయినాయి. కావున వీటిని పరిష్కరించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ ముఖ్యమంత్రితో చర్చించి సమస్యలు పరిష్కరించునున్నట్టు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు టిఎల్ పద్మ, ఎస్తేర్ రాణి, రాష్ట్ర కమిటీ సభ్యులు తలారి నాగమణి, స్నేహలత, ఏ వాణిదేవి, చంటమ్మా, విజయ, తులసి, రజని, భాను, మంగలక్ష్మి, రాజేశ్వరి, వరలక్ష్మి, సర్వాణి తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ కోనసీమ జిల్లా జెసిగా వైఖోమ్ నిడియా దేవి



**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా వైఖోమ్ నిడియా దేవి బాధ్యతలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన వైఖోమ్ నిడియాదేవి గురువారం జిల్లా కేంద్రమైన అమలాపురంలోని కలెక్టరేట్‌లో అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్‌ను ఆయన ఛాంబర్‌లో జేసి వైఖోమ్ నిడియా దేవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ పథకాలను ప్రజలలోనికి తీసుకెళ్లడంలో జేసి కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది జేసిని కలిసి ఘనంగా స్వాగతం పలికారు. వివిధ శాఖల అధికారులు ఆమెకు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. జిల్లా పాలనలో తమవంతు సహకారాన్ని అందిస్తామని అధికారులు తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ వారి మార్గదర్శకత్వంలో జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా పనిచేస్తానని పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కా రానికి ప్రాధాన్యత ఇస్తానని ఆమె హామీ ఇచ్చారు. జిల్లా అధికారులందరి సమన్వయంతో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఓ ఎ ఉదయభాస్కర్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ పి శ్రీని వాస్,ఎల్ డి ఎం కేశవ వర్మ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్టార్ హీరో సినిమాతో సమీరా రెడ్డి కంబ్యాక్!



ఒకప్పుడు టాలీవుడ్‌లో గ్లామర్ – నటనతో కుర్రకారును ఉర్రూతలూగించిన నటి సమీరా రెడ్డి. సుదీర్ఘ విరామం తర్వాత మళ్ళీ వెండితెరపై మెరిసేందుకు సిద్ధమవుతోంది. మెగాస్టార్ చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్ వంటి అగ్ర హీరోలతో నటించిన సమీరా పెళ్లి తర్వాత సినిమాలకు పూర్తిగా దూరమైంది. తాజాగా అందుతోన్న సమాచారం ప్రకారం సమీరా ఓ క్రేజీ ప్రాజెక్ట్ ద్వారా టాలీవుడ్‌లోకి గ్రాండ్ రీ–ఎంట్రీ ఇస్తోంది. సెకండ్ ఇన్నింగ్స్ కోసం ఓ స్టార్ హీరో సినిమాను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు ముగిశాని తెలిసింది.ఇందులో ఆమె ఓ కీలకమైన పాత్రలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని తెలిసింది. గతంలో కమర్షియల్ సినిమాల్లో హీరోయిన్‌గా అలరించిన సమీరా ఇప్పుడు వయస్సు , అనుభవానికి తగ్గట్టుగా ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటుంది. ఈ సినిమా ఆమె కెరీర్‌లో ఓ మలుపుగా నిలుస్తుందని భావిస్తుంది. సినిమాలకు దూరంగా ఉన్న సమయంలో సమీరా రెడ్డి సోషల్ మీడియా ద్వారా అభిమానులకు నిరంతరం టచ్‌లోనే ఉంది. బాడీ పాజిటివిటీ, మాతృత్వం, ఫిట్‌నెస్‌పై సమీరా పంచుకున్న వీడియోలు నెటిజన్లను ఎంతో ఆకట్టుకుంది. సెలబ్రిటీ హోదాను పక్కన పెట్టి వాస్తవ పరిస్థితులను ధైర్యంగా పంచుకోవడంతో ఆమెకు సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్ ఏర్పడింది. ఇప్పుడు నేరుగా వెండితెరపై ఆమెను చూడబోతున్నామన్న వార్త అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. సాధారణంగా సీనియర్ హీరోయిన్లు రీ–ఎంట్రీ ఇస్తున్నప్పుడు ఎలాంటి పాత్రలు చేస్తారనే ఆసక్తి అందరిలోనూ ఉంటుంది. సమీరా రెడ్డి కూడా పేరు కోసం కాకుండా కథలో ప్రాముఖ్యత ఉన్న పాత్ర అయితేనే నటించాలని నిర్ణయించుకుందిట. అందుకే ఓ స్టార్ హీరో ప్రాజెక్ట్ కావడంతో పాటు అందులో తన పాత్రకున్న వెయిటేజీని బట్టి ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. ఈ సినిమాతో తనలోని నటిని మరోసారి కొత్తగా ఆవిష్కరించుకోబోతుంది. సమీరా రెడ్డి రాకతో టాలీవుడ్‌లో సీనియర్ నటీమణుల జోరు మళ్ళీ పెరగనుంది. ఇప్పటికే పలువురు కథానాయికలు సెకండ్ ఇన్నింగ్స్‌లో దిగ్విజయంగా రాణిస్తున్నారు. ఈనేపథ్యంలో సమీరా కూడా అదే బాటలో సక్సెస్ సాధించాలని అభిమానులు ఆశీస్తున్నారుఉ. అయితే సమీరా రెడ్డి నటిస్తున్న ఆ స్టార్ హీరో సినిమా ఏది? అందులో ఆమె పాత్ర ఎలా ఉండబోతోంది అనే వివరాలు త్వరలోనే అధికారికంగా బయటకు రానున్నాయి.

# గ్లామర్ డోస్ పెంచేసిన కృతి సనన్.. బ్లాక్ అవుట్ ఫిట్ లో మరింత హీట్ పెంచుతూ!



అసలే సమ్మర్.. సూర్య భగవానుడి భగభగ మంటలకు ప్రజలు అల్లాడిపోతుంటే .. హీరోయిన్లు కూడా ఆ వేడిని మరింత పెంచడానికి సెగలు పుట్టించేలా ఔట్ ఫిట్స్ ధరిస్తూ సోషల్ మీడియా వేదికగా అందాలు ఆరబోస్తున్నారు. ఒకరు కాదు ఇద్దరు కాదు.. ఒకరి తర్వాత ఒకరు.. ఒకరితో ఒకరు పోటీపడుతూ గ్లామర్ విందు వడ్డిస్తూ అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు . ఇక సోషల్ మీడియా వాడకం ఎప్పుడైతే పెరిగిపోయిందో అటు చిన్న పిల్లల్ని మొదలుకొని పెద్దవాళ్ల వరకు ప్రతి ఒక్కరు మొబైల్ ఫోన్ లేనిదే గడవని రోజులు . అలాంటి ఈ సమయంలో హీరోయిన్స్ కూడా తమ అందాలను ఎరగా వేసి క్యాష్ చేసుకుంటున్నారు అనే వార్తలు ఎప్పటికప్పుడు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే అలా అందాలతో మరింత హీట్ పెంచుతూ బ్లాక్ అవుట్ ఫిట్ లో సెగలు పుట్టించే ప్రయత్నం చేసింది కృతి సనన్. విభిన్నమైన ఫోజులు ఇస్తూ సెగలు పుట్టించేలా ఫోటోలకు పంచుకుంది. బ్లాక్ అవుట్ ఫిట్‌లో కృతి షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. లెదర్ మెటీరియల్‌ను తలపించేలా బ్లాక్ డ్రెస్ ధరించిన ఈమె తన అవుట్ ఫిట్‌ను మరింత అందంగా మార్చుకుంది. హుందాగా ఫోటోలకు ఫోజులిస్తూ మెస్మరైజ్ చేసింది. మరికొన్ని ఫోటోలలో రొమాంటిక్‌గా ఫోజులిస్తూ నెటిజన్స్‌ను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. అలా మొత్తానికైతే కృతి తాజాగా షేర్ చేసిన ఈ లేటెస్ట్ ఫోటోషూట్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఇండస్ట్రీలోకి రాకముందు పెద్ద పెద్ద కంపెనీల కమర్షియల్ యాడ్స్‌లలో నటించిన ఈమె.. తొలిసారి తెలుగులో మహేష్ బాబు హీరోగా వచ్చిన 1: నేనొక్కడినే అనే సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసింది. ప్రముఖ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను 14 రీల్స్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందించారు. ఇక ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకులను తన అందం, హైట్‌తో అందర్నీ ఆకట్టుకున్న కృతి సనన్.. హిందీలో జాకీ ష్రాఫ్ వారసుడు టైగర్ ష్రాఫ్ తో హీరోపంతి సినిమాలో నటించి హిందీ రంగ ప్రవేశం చేసింది. ఇక తర్వాత ఆదిపురుష్ సినిమాలో సీత పాత్ర పోషించి.. ఇటు తెలుగు ప్రేక్షకులను మరోసారి పలకరించింది కృతి సనన్. హిందీలోనే సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె తాజాగా కాక్ టెయిల్ 2 సినిమాలో నటిస్తోంది. రష్మిక మందన్నతో కలిసి నటిస్తోంది. ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా అందం, అభినయంతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తుంది ఈ చిన్నది.. మరి ఈ సినిమాతో బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందో చూడాలి.


# సందీప్ వంగ కల నిజమైంది, కానీ..!



ఇండస్ట్రీలో ఉన్న ప్రతి నటుడికి డ్రీమ్ రోల్, ప్రతి దర్శకుడికి డ్రీమ్ ప్రాజెక్ట్ అనేది ఉంటుంది. చాలా మంది హీరోలకు, హీరోయిన్స్‌కి, తమ డ్రీమ్ రోల్ చేసే అవకాశం రాదు, ఇక చాలా తక్కు మంది దర్శకులు మాత్రమే తమ డ్రీమ్ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించిన దాఖలాలు ఉన్నాయి. ప్రతి దర్శకుడికి ఉన్నట్లుగానే ప్రముఖ దర్శకుడు సందీప్ వంగకి సైతం డ్రీమ్ ప్రాజెక్ట్ ఉంది. గతంలో ఒక ఇంటర్వ్యూలో సందీప్ వంగ తన డ్రీమ్ ప్రాజెక్ట్ గురించి మాట్లాడుతూ తనకు ఎంతో ఇష్టమైన మైఖేల్ జాక్సన్ బయోపిక్‌ను తీయాలని కోరుకుంటున్నట్లుగా చెప్పుకొచ్చాడు. ఆ బయోపిక్ తీస్తే తానంత అదృష్టవంతుడు మరొకరు ఉండరు అన్నట్లుగా కూడా ఆయన మాట్లాడారు. అంతేకాకుండా మైఖేల్ జాక్సన్ బయోపిక్ తీసే అవకాశం వస్తే అంతకు మించిన సంతోషం తన జీవితంలో ఉండదు అని కూడా ఆ ఇంటర్వ్యూలో సందీప్ వంగ చెప్పుకొచ్చాడు. సందీప్ వంగ గత కొన్ని సంవత్సరాలుగా మైఖేల్ జాక్సన్ బయోపిక్ తీయాలని కలలు కంటున్నాడు. సందీప్ వంగ కలల్లో ఉండగానే మైఖేల్ జాక్సన్ బయోపిక్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. నేడు మైఖేల్ టైటిల్‌తో మైఖేల్ జాక్సన్ బయోపిక్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మైఖేల్ జాక్సన్ కుటుంబ సభ్యుల నుంచి ఈ ప్రాజెక్ట్ వచ్చింది. అంటోయిన్ ఫుక్వా దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో మైఖేల్ జాక్సన్ పాత్రను ఆయన మేనల్లుడు జాఫర్ జాక్సన్ పోషించాడు. ఇప్పటికే వచ్చిన పోస్టర్స్, ట్రైలర్‌లు సినిమాపై అంచనాలు పెంచారు. ప్రపంచ వ్యాప్తంగా మైఖేల్ ను అభిమానించే వారు. అయితే ఆయన చనిపోయి దాదాపు 20 ఏళ్లు అవుతున్న కారణంగా ఇప్పుడు ఆయన బయోపిక్‌ను జనాలు చూస్తారా అనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. కానీ అనుమానాలు పటాపంచలు చేస్తూ అత్యధికంగా అడ్వాన్స్ బుకింగ్ నమోదు అయ్యింది.

ఇండియాలోనే మైఖేల్ మూవీకి లక్షకు పైగా టికెట్లు అడ్వాన్స్ బుకింగ్ కావడం రికార్డ్‌గా చెప్పుకోవచ్చు. కేవలం ఇంగ్లీష్ వర్షన్ మాత్రమే ఇండియాలోనూ స్క్రీనింగ్ అవుతోంది. ఇంగ్లీష్‌లోనూ చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తి కనబర్చారు అంటే ఆయన క్రేజ్ ఏంటో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన జీవితాన్ని అంతా తెలిసిన వారు సినిమాగా తీస్తే బాగుంటుంది అనే ఉద్దేశంతో చాలామంది ఫిల్మ్ మేకర్స్ ఆసక్తి ఉన్నప్పటికీ దూరంగా ఉంటూ వచ్చారు. ఇప్పుడు అంటోయిన్ ఫుక్వా దర్శకత్వంలో సినిమా రూపొంది ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మైఖేల్ చిన్నప్పటి నుంచి పెద్ద అయ్యే వరకు ఏం జరిగింది, ఎలా జరిగింది. ఆయన క్రేజ్ ఎలా పెరిగింది. ఆయన షోలకు వచ్చే రెస్పాన్స్ అన్నింటిని కూడా సినిమాలో చక్కగా చూపించారు అంటూ ప్రివ్యూ టాక్ వచ్చింది. మైఖేల్ సినిమా విడుదల నేపథ్యంలో సందీప్ వంగ డ్రీమ్ ప్రాజెక్ట్ గురించి సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. అర్జున్ రెడ్డి, యానిమల్ వంటి సినిమాలతో సందీప్ రెడ్డి వంగ దర్శకుడిగా పాన్ ఇండియా రేంజ్‌లో గుర్తింపు దక్కించుకున్నాడు. అలాంటి దర్శకుడు మైఖేల్ జాక్సన్ కథతో హిందీలో సినిమా తీసి ఉంటే కచ్చితంగా బాలీవుడ్‌తో పాటు, ఇతర ఇండియన్ భాషల్లో మంచి స్పందన వచ్చి ఉండేది. హాలీవుడ్‌లోనూ సినిమా గురించి చర్చ జరిగి ఉండేది. మైఖేల్ జాక్సన్ పాత్రను పోషించేందుకు సరైన నటుడు లేకపోవడం వల్ల ఆయన ఇన్నాళ్లు తన డ్రీమ్ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకు వెళ్లలేక పోయాడు అనేది కొందరి మాట. తాను తీయాలి అనుకున్న మైఖేల్ జాక్సన్ బయోపిక్‌ను ఎవరు తీసినా కూడా కచ్చితంగా తాను థియేటర్ కి వెళ్లి చూస్తాను అంటూ ఒక ఇంటర్వ్యూలో సందీప్ రెడ్డి వంగ చెప్పుకొచ్చాడు. అన్నట్లుగానే త్వరలోనే సందీప్ వంగ మైఖేల్ సినిమాను థియేటర్‌లో చూసేందుకు రెడీ అవుతున్నాడా అనేది తెలియాల్సి ఉంది. మైఖేల్ జాక్సన్ జీవితం గురించి పూర్తిగా తెలుసుకోవాలని సందీప్ రెడ్డి వంగకు మాత్రమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులకు ఉంటుంది. అందుకే మైఖేల్ సినిమాకు మంచి స్పందన దక్కడం ఖాయం.

# అలియా భట్ కూతురు డాక్టర్..యాక్టర్ కాదు!



కపూర్ ఖాందాన్ వారసురాలు అంటే కచ్చితంగా వెండితెరపై నటిగానే అడుగు పెడుతుందని అందరూ భావిస్తారు. ఆ కుటుంబంలో తరం మారినా నటనపై ఉన్న మక్కువ మాత్రం తగ్గలేదు. అయితే అలియా భట్ మాత్రం తన కుమార్తె విషయంలో చాలా భిన్నంగా ఆలోచిస్తున్నారు. తన కుమార్తె నటి కావాలని తాను కోరుకోవడం లేదని ఆమె చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా అలియా భట్ మనసులోని మాటను బయటపెట్టింది. రాహా ఒక గొప్ప అథ్లెట్ లేదా క్రీడాకారిణి కావాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

రాహాలో చురుకుదనం, క్వాలిటీలను చూస్తుంటే క్రీడల పట్ల ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలని అలియా భావిస్తు న్నారు. సాధారణంగా సినిమా ఇండస్ట్రీలో వారసులను చిన్న ప్పటి నుండి గ్లామర్ ప్రపంచానికి అలవాటు చేస్తారు.

కానీ అలియా మాత్రం తన కూతురు మైదానంలో చెమట చిందిస్తూ దేశానికి పేరు తీసుకు రావాలని కోరుకోవడం విశేషం. నిజానికి కపూర్ కుటుంబంలో ఇతర రంగాల్లో స్థిరపడిన వారు చాలా అరుదుగా కనిపిస్తుంటారు. పృథ్వీరాజ్ కపూర్ నుండి నేటి రణబీర్ వరకు అందరూ నటననే వృత్తిగా ఎంచుకున్నారు.

# కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసింది : మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

## - వైకాపా పాలనలో మొక్కజొన్నకు గిట్టుబాటు ధర లేకపోతే అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్యమంత్రి జగన్‌తో మాట్లాడి మద్దతు ధర ఇప్పించారు : మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య






**గజపతినగరం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి, శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక బెల్లాన కన్వెన్షన్‌లో నియోజకవర్గ, గ్రామ కమిటీల విస్తృతస్థాయి సమావేశం మరియు నూతనంగా నియమింపబడ్డ మండల పార్టీ అధ్యక్షులు పల్లి సంజీవరావు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ కో-ఆర్డినేటర్ బూడి వెంకట్రావుల పదవి స్వీకరణ మహోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బొత్స సత్యనారాయణ ఒక్క పింఛన్ మొత్తం పెంచడం తప్ప, కూటమి ప్రభుత్వం ఈ రెండు ఏళ్లలో మిగిలిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేకపోయారని దుయ్యబట్టారు. తల్లికి వందనం పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను సైతం చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో ఒకేసారి తల్లి ఖాతాలో 13,500 జమ చేయగా, ప్రస్తుత ప్రభుత్వం రెండు విడతలగా ఆ మొత్తాన్ని జమ చేస్తూ కొందరికి ఎగనామం పెట్టిందన్నారు. ఉపాధి హామీ అంతా దోల్ల చేశారని, వంతుల వారీగా కూలీలకు పని కల్పించడం సిగ్గుచేటు అన్నారు. రైతుల పరిస్థితి మరి అధ్వానంగా ఉందని విచారం వ్యక్తం చేశారు. ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేయడమంటే ఇలాగేనా అని ప్రశ్నించారు. మూడు లక్షల 45 వేల కోట్లు అప్పులు చేసి రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. దోచుకోవడం, దాచుకోవడం పనిలో తెలుగుదేశం నేతలు నిమగ్నమై ఉన్నారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ లను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడం బాధాకరమన్నారు. గీతం యూనివర్సిటీకి ఐదువేల కోట్ల విలువచేసే ప్రభుత్వ భూములను దారాదత్తం చేయడం ఈ ప్రభుత్వ దోపిడీకి నిదర్శనం అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నియోజక అభివృద్ధిని పక్కనపెట్టి, తన వ్యక్తిగత అభివృద్ధి కోసం అవినీతిలో ముందంజలో ఉన్నారని విమర్శించారు. తండ్రి, కొడుకులు ఇద్దరు అవినీతి కార్యక్రమాలు చేయడంలో ఆరితేరారన్నారు. రెండేళ్లు గడుస్తున్న నియోజకవర్గంలో అభివృద్ధి జాడలు మచ్చుకైన కనిపించడం లేదని అన్నారు. పరిశ్రమలు తెచ్చే సత్తా, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే సత్తా మంత్రి కొండపల్లి శ్రీనివాసులో లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే బొత్స మాట్లాడుతూ, ఈ ప్రభుత్వానికి దోచుకోవడంలో ఉన్న శ్రద్ధ, అభివృద్ధిపై లేదన్నారు. ఈ రెండేళ్ళలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఆ హామీని మరిచారని అన్నారు. అలాగే నియోజకవర్గంలో వైయస్సార్సీపి అనుకూల ఓట్లు తొలగించమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్వయంగా రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తేవడం సిగ్గుచేటు అన్నారు. నియోజకవర్గంలో ప్రజాబలం తమకే ఉందన్నారు. ఈ కూటమి ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం నిర్మించిన ఆసుపత్రులను, వేయించిన తారు రోడ్లను మాత్రమే ప్రారంభోత్సవాలు చేశారని మాజీ ఎమ్మెల్యే బొత్స అన్నారు. అదేవిధంగా గ్రామాలలో సిమెంటు రోడ్లు వేయించడం తప్ప ఇంకా చేసిన అభివృద్ధి ఏమీ లేదని బొత్స ఎద్దేవా చేశారు.వైసీపీ పాలనలో మొక్కజొన్నకు ధర లేకపోతే అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్యమంత్రి జగన్‌తో మాట్లాడి మొక్కజొన్నకు మద్దతు ధర ఇప్పించారని బొత్స గుర్తు చేశారు. అలాగే ఇదే సమావేశంలో మాజీ పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే సంబంగి వెంకట చిన్నప్పల నాయుడు మాట్లాడుతూ, గత ఎన్నికల్లో పార్టీ నాయకుల నిర్లక్ష్యము, మితిమీరిన ధీమా కారణంగానే ఓడిపోయామన్నారు. రాబోయే ఏ ఎన్నికల్లోనైనా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతులు ఈ ప్రభుత్వంలో కష్టాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎరువులు, విత్తనాలు దగ్గర నుంచి రైతు కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడం సిగ్గుచేటు అన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎక్కడ అన్నారు. అనంతరం నూతనంగా నియమింపబడ్డ మండల పార్టీ అధ్యక్షులుగా పల్లి సంజీవరావు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ కోఆర్డినేటర్ గా బూడి వెంకట్రావు పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సమావేశంలో విజయనగరం పార్లమెంట్ పరిశీలకులు కిల్లి సత్యనారాయణ, నియోజకవర్గ పరిశీలకులు సిరిపురపు జగన్మోహనరావు, మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు మూకల చలం నాయుడు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పిరుబండి జైహింద్ కుమార్, జడ్పిటిసిలు గార తౌడు, వర్రీ నరసింహమూర్తి, రౌతు రాజేశ్వరి, ఎంపీపీలు బెల్లాన జ్ఞానదీపిక, వైస్ ఎంపీపీ కర్రీ శ్రీదేవి, నాయకులు కర్రీ నానాజీ, కర్రీ రామనాయుడు, ఎంపీపీలు పిరుబండి హైమావతి,గేదెల సింహాద్రి అప్పలనాయుడు, సి.హెచ్.చిన్నమనాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ వేమిలి ముత్యాల నాయుడు, జిల్లా క్రికెట్ సంఘం మాజీ కార్యదర్శి నారాయణ మూర్తి రాజు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.


# ఆదర్శవంతమైన గ్రామంగా కురసింగి

## - జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి



**సీతంపేట, (రాజధాని వార్తలు):** పాలకొండ నియోజకవర్గం సీతంపేట మండలంలోని కురసింగి గ్రామం ముస్తాబు చేసుకొని ఒక ఆదర్శవంతమైన గ్రామంగా నిలిచిందని జిల్లా కలెక్టర్ డా.ఎన్ ప్రభాకర రెడ్డి కొనియాడారు. గ్రామాల రూపురేఖలను మార్చి, వాటిని ప్రతీ ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'గ్రామ ముస్తాబు' కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందని వివరించారు. గురువారం సీతంపేట మండలం కురసంగి గ్రామంలో ఏర్పాటు చేసిన 'గ్రామ ముస్తాబు' కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. డోలి రహిత జిల్లాగా మన్యంను తీర్చిదిద్దుతున్నామని, అందులో భాగంగా మారుమూల గిరిజన గ్రామమైన కురసింగికి బీటీ రోడ్డును నిర్మించుకోవడం గర్వకారణమని అన్నారు. అలాగే విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించి మొదలుపెట్టిన ముస్తాబు, నేడు ఫ్యామిలీ ముస్తాబు, గ్రామ ముస్తాబు కావడం ఆనందదాయకమన్నారు. ఈ గ్రామాన్ని ముస్తాబు చేసి అద్భుతమైన, సుందరమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన గ్రామస్తులను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. గ్రామ ప్రధాన ద్వారం దగ్గర నుంచి గ్రామం లోపల వరకు ఎక్కడా చెత్త కనిపించకుండా చేసారన్నారు. ఇక్కడ స్కూల్ ముస్తాబు చేశారని, వృధాగా ఉన్న స్థలాన్ని పార్కుగా మార్చారని పేర్కొన్నారు. పిల్లలు ఆడుకునేందుకు, ఆస్వాదించేందుకు ఊయల కూడా ఏర్పాటుచేశారని, రహదారులను పరిశుభ్రంగా ఉంచారని, సమావేశాలకు సామాజిక భవనం కూడా ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. స్థానిక శాసనసభ్యులు ఈ నియోజకవర్గంపై చొరవ చూపుతూ, రహదారుల నిర్మాణాలు చేయిస్తున్నారని గుర్తుచేశారు. ఈ గ్రామాన్ని ఇంత అద్భుతంగా తయారుకావడం మరిన్ని గ్రామాలకు స్ఫూర్తి అయిందని తెలిపారు. సూర్యమండలం పేరుతో విభిన్న కాయగూరల పంటలను వేసుకొని పండించుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాల్గొని కార్యక్రమ విశిష్టతను వివరించారు. గర్భిణీలకు సీమంతాలు చేపట్టారు. పాలకొండ శాసన సభ్యులు నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని, అందులో భాగంగానే ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రతి గ్రామం పరిశుభ్రంగా, పచ్చదనంతో కళకళలాడాలని ఆయన ఆకాంక్షించారు. ముస్తాబుతో వీధులు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. పాఠశాలలు, ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని అన్నారు. పాఠశాలలు మరియు వీధుల్లో కనీస సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా గ్రామ ప్రజల జీవన ప్రమాణాలను పెంచవచ్చని అభిప్రాయపడ్డారు. కురసంగి గ్రామంలో చేపట్టిన ఈ పనులు మిగిలిన గ్రామాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాలకొండ సబ్ కలెక్టర్ & ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.


# విద్యార్థుల నిజాయితీ -దొరికిన సెల్ ఫోను, డబ్బులు అప్పగింత



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని మర్రివలస ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మరోసారి తమ నిజాయితీని నిరూపించుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనకల చంద్రరావు విద్యార్థుల్లో విలువలు పెంపొందించే కార్యక్రమంలో భాగంగా చేపట్టిన "నేను చేసిన మంచి పని పుస్తకం" మంచి ఫలితాలను ఇస్తుందని ఈ సందర్భంగా చంద్రరావు గురువారం విలేకరులకు తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థి దిలీప్‌కు రెండు రోజుల క్రితం సాలిపేట మార్గ మధ్యలో ఒక మొబైల్ ఫోన్ దొరికింది. దిలీప్ ఆ ఫోనును ప్రధానోపాధ్యాయులకు అప్పగించాడు. అలాగే గాయత్రి అనే విద్యార్థినికి టి. భూర్జివలస శివాలయం దగ్గర ఒక పర్సుతో 2500 రూపాయలు దొరికాయి. ఈ మొత్తాన్ని కూడా ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ దొరికిన సెల్ ఫోను, నగదు సంబంధిత వ్యక్తులకు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు చంద్రరావు తెలిపారు. తాను పాఠశాలలో ప్రారంభించిన నేను చేసిన మంచి పని పుస్తకం మంచి ఫలితాలను ఇవ్వడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా చంద్రరావు తెలిపారు. ఈ మంచి పనిని పాఠశాల పుస్తకంలో నమోదు చేశామన్నారు.

# అంగరంగ వైభవంగా సీతారామ కళ్యాణం


**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణం శ్రీమద్రామాయణ ప్రాంగణంలో సీతారాములకు కన్నుల పండుగగా కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని దేవాలయం అర్చకులు చాణక్య, శ్రీహర్ష, కృష్ణ తేజలు వేదమంత్రాలు నడుమ సీతారాములకు కళ్యాణ మహోత్సవం గవించారు.ముందుగా గురువారం ఉదయం సీతారాములకు పంచామృత అభిషేకాలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో ఎన్‌సిఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు భక్తులు పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వ పాలన "పిచ్చి తుగ్లక్ పాలన" : జమ్మలమడక

## - విశాఖలో వాకింగ్‌కే ఫీజులా?

**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన "పిచ్చి తుగ్లక్ పాలన"లా మారిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మల మడక నాగమణి తీవ్రంగా విమర్శించారు. గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లా డుతూ విశాఖపట్నం ప్రజలు విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నారని అన్నారు. విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తీసుకున్న తాజా నిర్ణ యం ప్రజలను షాక్‌కు గురి చేసిందన్నారు. నగరం లోని పార్కులు, స్టేడియంలలో వాకింగ్ చేయాలంటే ప్రతి వ్యక్తి రూ. 750 చెల్లించాల్సిందిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం తీవ్ర ఆగ్రహానికి దారితీస్తోందని తెలిపారు. ప్రతిరోజూ వేల సంఖ్యలో ప్రజలు ఆరోగ్యం కోసం వాకింగ్ చేస్తుంటారని, వారిపై ఇలా బలవంతపు వసూళ్లు చేయడం సరైనది కాదని ప్రశ్నించారు. ఖరీదైన జిమ్‌లు, హెల్త్ క్లబ్బులకు వెళ్లలేని పేద, మధ్య తరగతి ప్రజలు కూడా ఇప్పుడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. ఇలాంటి నిర్ణయాలు భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని ఆమె వ్యాఖ్యానించారు. పేద, మధ్య తరగతి ప్రజలు



ఎలాంటి పన్నులు వేసినా చెల్లిస్తారనే భావనతో ప్రభుత్వం వ్యవహరిస్తుందా అని ప్రశ్నించారు. ఇక మరోవైపు, కార్పొరేట్ ఆస్పత్రులు మరియు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో పేదలకు ఉచిత వైద్యం అందడంలో సమస్యలు తలెత్తుతున్నాయని నాగమణి ఆవేదన వ్యక్తం చేశారు.

# టిడిపి నుంచి వైకాపాలోకి...వైకాపా తీర్థం పుచ్చుకున్న 50 కుటుంబాల యువకులు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** టిడిపి నుంచి 50 కుటుంబాల యువకులు గురువారం వైకాపా తీర్థం పుచ్చుకున్నారు. గురువారం జరిగిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో గజపతినగరం మేజర్ పంచాయతీకి చెందిన 50 కుటుంబాల యువకులు మాజీ ఉప సర్పంచ్ కర్రీ రామునాయుడు, రూమ్కాన భాస్కరరావు, వైస్ ఎంపీపీ కర్రీ శ్రీదేవి, కర్రీ నానాజీ, ఆల్తి రామనాయుడు ఆధ్వర్యంలో టిడిపి పార్టీని వీడి వైఎస్ఆర్సిపి లో చేరారు. జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, నియోజకవర్గ ఇన్చార్జ్ బొత్స అప్పలనరసయ్య వీరందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# రజకులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలి

## - రజక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగదీష్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన రజకులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని నవ్యాంధ్రప్రదేశ్ రజక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనుపూరు జగదీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెల్లూరులోని ప్రెస్ క్లబ్లో గురువారం ఉదయం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 50 ఏళ్లు నిండిన రజకులకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. అలాగే రజక వృత్తిదారులకు తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉద్యోగాల సదుపాయం కల్పించాలని కోరారు. తమ సంఘం నెల్లూరు జిల్లా కమిటీని కొంతమందితో ఎన్నుకున్నామన్నారు జిల్లా అధ్యక్షుడిగా హనుమంతరావు, మహిళా జిల్లా అధ్యక్షురాలుగా అల్లూరు కృష్ణవేణి, జిల్లా జాయింట్ కార్యదర్శిగా బిట్రగుంట వేణు, నెల్లూరు రూరల్ అధ్యక్షుడిగా చిరంజీవిని ఎన్నుకున్నామన్నారు. మిగతా సభ్యులను, మండల స్థాయి కమిటీలను త్వరలో ఎన్నుకుంటామని వెల్లడించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మహిళ అధ్యక్షరాలు జిల్లా జాయింట్ సెక్రెటరీ నెల్లూరు రూరల్ మండలం అధ్యక్షులుగా ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందజేశారు.

# చేసేది కొండంత - ఇచ్చేది గోరంత

## - ఆర్డీవో కార్యాలయం వద్ద అంగన్వాడీల నిరసన



**శ్రీకాళహస్తి టౌన్, (రాజధాని వార్తలు):** అంగన్వాడీల చేత గొడ్డు చాకిరీ చేయించుకుని కనీస వేతనాలివ్వడంలో కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని అంగన్వాడీలు మండిపడ్డారు. తమ న్యాయపరమైన పది డిమాండ్లను పరిష్కరించాలంటూ స్థానిక ఆర్డిఓ కార్యాలయం వద్ద గురువారం సిఐటియు, ఐఎఫ్టీయూ అనుబంధ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ధనలక్ష్మి, స్వర్ణ సంయుక్తంగా మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన వారికి చట్టప్రకారం గ్రాట్యూటీ అందించడం లేదన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ చనిపోతే, చనిపోయిన రోజే ఇవ్వాల్సిన మట్టి ఖర్చులను తాత్సారం చేస్తున్నారని తెలిపారు. హెల్పర్ల ప్రమోషన్ల ప్రక్రియలో భాగంగా జారీ చేసిన జీవో 5 వల్ల రాజకీయ ప్రమేయం పెరిగి స్థానికంగా ఉన్నవారికి అన్యాయం జరుగుతుందన్నారు. అంగన్వాడీలకు సాధారణ వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.26 వేలు కనీస వేతనమివ్వాలన్నారు. యాప్‌ల యాతన తగ్గించాలన్నారు. అంగన్వాడీయేతర పనులకు అంగన్వాడీలను వినియోగించకూడదని సూచించారు. అంగన్వాడీలను విస్మరిస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే కూటమికీ తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సౌజన్య, రేవతి, రాజ్యం, శోభ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన సరుకులను తక్కువ ధరలకు అందించడమే లక్ష్యం : రాజేష్





**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంట పట్టణంలోని బజార్ స్ట్రీట్‌లో రాజేష్ ట్రేడర్స్‌ను అంగరంగ వైభవంగా గురువారం నాడు ప్రత్యేక పూజలతో ముఖ్య అతిధుల సమక్షంలో గ్రాండ్ ఓపెనింగ్‌ను యాజమాన్యం రాజేష్ ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా రేణిగుంట మండల అధ్యక్షులు మునిచంద్రా రెడ్డి, పట్టణ అధ్యక్షులు మహబూబ్ బాషా ఏ.ఎన్.ఆర్ కాలనీ సుబ్బయ్య రిబ్బన్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాజేష్ ట్రేడర్స్ యాజమాన్యం రాజేష్ మాట్లాడుతూ రేణిగుంట పట్టణ ప్రజలకు నాణ్యత, ప్రతి ఒక్కరికి తక్కువ ధరలకు అందుబాటులో ఉండే విధంగా హోం డెలివరీ అందిస్తామని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఏ.ఎన్.ఆర్ కాలనీ సుబ్బయ్య, హరీష్, వినయ్, నరేష్, వసీం తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులైన నక్కల జాతికి తెలుగుదేశం పార్టీ

## - ఎన్డీఏ కూటమి ఎప్పుడు అండగా ఉంటుంది : సుబ్బయ్య



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** గిరిజనుల అయినటువంటి నక్కల జాతికి తెలుగుదేశం పార్టీ,ఎన్డీఏ కూటమి ఎప్పుడు అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా మండలి సభ్యులు ఎం. సుబ్బయ్య అన్నారు. నెల్లూరు ఐటిడిఏ గిరిజన కార్యాలయంలో 100 మంది నక్కల జాతికి చెందిన వారు వారి వ్యాపారానికి సం బంధించిన ఎక్కడైనా తిరునాళ్ళు జరిగితే లైసెన్సులు, ఐడెంటి కార్డులు కావాలని కోరారు. అలాగే వారు తిరుమల, తిరుపతి శ్రీకాళహస్తి, శ్రీశైలం దేవస్థానాల వద్ద పూసలు దండలు అమ్ముకోవడానికి అంగళ్లకు లైసెన్సులు ఇవ్వాలని కోరారు. దీంతో ఆయన మాట్లాడుతూ మీరు కోరిన కోర్కెలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకుని పోయి వెంటనే సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా మండలి సభ్యులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి ఎం.సుబ్బయ్య హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నక్కల కమ్యూనిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా మట్టం శ్రావణి రెడ్డి

## - భారీ గజమాలతో ఘన స్వాగతం పలికిన నాయకులు, కార్యకర్తలు





**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు మండలం, చెన్నూరు గ్రామానికి చెందిన తిరుపతి పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించి, టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా పదవిని ఇవ్వడం జరి గింది. ఈ సందర్భంగా మట్టం శ్రావణి రెడ్డికి గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయిలో పదవి రావడం పట్ల చెన్నూరులో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు ఆనందోత్సవంతో హర్షం వ్యక్తం చేశారు. చెన్నూరు గ్రంథాలయం సెంటర్లో టిడిపి కార్యకర్తలు, అభిమానులు ఆమెకు సన్మాన సభను ఏర్పాటు చేసి భారీ గజమాలతో ఘన స్వాగతం పలికి, శాలువాలతో సత్కరించి 20 కేజీల కేక్‌ను ఆమె చేతులు మీదుగా కటింగ్ చేయించారు. అనంతరం భారీగా బాణాసంచా పేల్చి, అందరికీ స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథులుగా హాజరైన గూడూరు 24 సొసైటీ అధ్యక్షులు అల్లూరు కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ చిన్న వయసులో రాజకీయాల్లోకీ ఆరంగ్రేటం చేసి గూడూరు మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా పదవిని చేపట్టి ప్రజలకు ఎంతో సేవ చేశారని అన్నారు. అదేవిధంగా టిడిపి సీనియర్ నాయకులు పడాల వెంకటరత్నయ్య మాట్లాడుతూ...మట్టం శ్రావణి రెడ్డి నిరంతరం ప్రజాసేవలో ఉంటుందని, గ్రామ ప్రజలకు ఎలాంటి సమస్యలనైనా ఆమె దృష్టికి వచ్చిన వెంటనే గూడూరు శాసన సభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కారం మార్గం చూపుతోందని అన్నారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణతో మెలుగుతూ, పార్టీని బలోపేతం చేయడంతో పాటు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ముఖ్య అనుచరులుగా ఉంటూ 2024 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి తన వంతు కృషిచేసి తెలుగుదేశం పార్టీకి విధేయురాలుగా గుర్తింపు తెచ్చుకోవడం జరిగిందన్నారు. అనంతరం టిడిపి రాష్ట్ర కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి మాట్లాడుతూ...తెలుగుదేశం పార్టీ అధిష్టానం రాష్ట్ర కమిటీలో నాకు చోటు కల్పించి, రాష్ట్ర కార్యదర్శిగా నియమించడంలో నాకు సహాయ, సహకారాలు అందించిన టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గూడూరు శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ప్రముఖ వ్యాపారవేత్త కొండపాటి గంగా ప్రసాద్, పెంచలకోన ఆలయ కమిటీ మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ తానంకి నానాజీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, మంత్రి నారా లోకేష్‌కి ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. నాపై నమ్మకంతో నా వెంట నడిచిన కార్యకర్తలకు, అభిమానులకు, గ్రామ ప్రజలకు నేను ఎల్లప్పుడూ ఋణపడి ఉంటానని అన్నారు. ఇకనుండి ప్రజలకు సేవ చేయడంలో నాపై మరింత బాధ్యత పెరిగిందని, ప్రజలకు ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలును అందిం చడంతో పాటు మునుపటిలాగా గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ ముందుంటానని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెన్నూరు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, పలు కాలనీలలో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేశామని, మిగిలిన కాలనీలలో కూడా పెండింగ్ పనులను త్వరలో ఎమ్మెల్యే సహకారంతో పూర్తి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు చేనేత సొసైటీ అధ్యక్షులు కటికాల శ్రీనివాసులు, ఏఎంసీ డైరెక్టర్ మల్లి శ్యామల, టిడిపి నాయకులు అల్లం కృష్ణయ్య, గోవిందు రాజేంద్ర, హరీష్, ధారా బాబు, శంకర్, ఎస్సీ సెల్ నాయకులు, బీసీ సెల్, గిరిజన సంఘాల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పోషణ పక్వాడా విజయవంతం

## - ప్రత్యేక భూమికను పోషించిన అంగన్‌వాడీలు - పిల్లలు స్క్రీన్ టైమ్‌పై తల్లితండ్రులకు సూచనలు : ఐసీడీఎస్ వావిళ్ళ సెక్టర్ సూపర్‌వైజర్ కోటేశ్వరి





**విడవలూరు, (రాజధాని వార్తలు):** చిన్నారులు కృత్రిమ ఆహారములు జంక్ ఫుడ్‌లులాంటివి తీసుకోవడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వీటిపై తల్లితండ్రులకు అవగాహన కార్యక్రమంను పోషణ పక్వాడ ద్వారా గురువారం, రామతీర్థం పంచాయితీ ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంములో నిర్వహించడం జరిగింది. తల్లితండ్రులకు, పిల్లలకు వావిల్ల సెక్టర్ సూపర్ వైజర్ కోటేశ్వరి సూచించారు. పుట్టిన బిడ్డ మొదటి అరేళ్లల్లో మెదడు అభివృద్ధి పెంచడం, చిన్నారులు ఎదుగుదల మెదడు వికాసములో కుటుంబ సభ్యులు తల్లితండ్రులు పాత్రపై ప్రత్యేక అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టిక ఆహారాన్ని అందించడములో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక భూమికను పోషిస్తున్నాయని సూపర్ వైజర్ కోటేశ్వరి అన్నారు. జంక్ ఫుడ్ బదులుగా, చిరు ధాన్యాలతో చేసిన ఆహారాన్ని ఇవ్వడం, చిన్నారులకు ఆటలు ద్వారా విద్యను అందించాలని అన్నారు. సెల్ ఫోన్‌ల ద్వారా కలిగే అనారోగ్య సమస్యలు గురించి వివరించారు.

పిల్లలు స్క్రిన్ టైమ్ తగ్గింపుపై సూచనలు ఇచ్చారు. గర్భిణీలు బాలింతలకు పోషకహారంపై అవగాహన కల్పించారు. రామతీర్థం ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం పంచాయతీ పరిధిలో గల అంగన్‌వాడీ టీచర్‌లు రూతమ్మ, కొమారి విజయ, గంగమ్మ, ప్రసున్న, మంగమ్మ, మాధవి, రామతీర్థం టీచర్లు కామాక్షి, తిరుపతమ్మ, ధనలక్ష్మి, స్థానిక పిల్లలు తల్లులు పాల్గొన్నారు.

# అనంతబాబును అరెస్ట్ కోరుతూ దళిత సంఘాలు నిరసన



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** దళిత యువకుడు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితులైన అనంతబాబు దంపతులను వెంటనే అరెస్ట్ చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సామర్లకోట బ్రౌన్ పేట్ సెంటర్లో గల డా.అంబేద్కర్ పార్కులో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. దళిత యువకుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఘటన మన రాష్ట్రంలోనే గతంలో చోటుచేసుకుందని దళిత సంఘాల నాయ కులు అందుగుల జార్జి చక్రవర్తి పేర్కొన్నారు. డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడిగా ఉన్న అనంత బాబు సాక్షులను భయభ్రాంతులకు గురి చేయడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరారీలో ఉన్న అనంతబాబును తక్షణమే అరెస్ట్ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దళిత సంఘాల నాయకులు ఎమ్మెల్సీ అనంత బాబును అరెస్ట్ చేయాలని నిరసన చేపట్టడం జరిగిందన్నారు. తక్షణమే అరెస్టు చేయని నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా దళితులందరూ ఉద్యమం చేపట్టడం జరుగుతుందని సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అందుగుల మణికుమారి, నాయకులు దాట్ల శ్రీనివాస్, కాళ్ళ రవీంద్రబాబు, గొల్లపల్లి సత్యనారాయణ, కాపవరపు కుమార్, గొల్లపల్లి కామరాజు, పోలిపల్లి బాబి, గోర్తి సత్యనారాయణ, ఆర్.నవీన్, మెండెం సరయ్య, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు జడ్పీ విద్యార్థులు ఎంపిక



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** కర్నూలు, మచిలీపట్నం పట్టణాల్లో తాజాగా జరిగిన అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని అభినందించే కార్యక్రమం గురువారం పాఠశాలలో చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కే విజయలక్ష్మి, జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు లభిస్తుందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుని ఆర్ వరలక్ష్మి మాట్లాడుతూ 2025 – 26 సంవత్సరానికి గాను జరిగిన స్కూల్ గేమ్స్ అండర్ 17 విభాగంలో కే కుమారి, అరుణ శ్రీ ఎం విరోనికలు, అండర్ 14 విభాగంలో జె లోవ కుమారిలు అత్యంత ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. కాగా విద్యార్థులకు క్రీడల్లో తరిపేదినిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుని వరలక్ష్మిని, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం విజయలక్ష్మి, పాఠశాల కమిటీ అధ్యక్షులు పచ్చట్లో లోవరాజు, మానవ హక్కుల సంఘం అధ్యక్షులు అప్పలకొండ, ఉపాధ్యాయులు హనుమంతరావు తదితరులు అభినందించారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call

9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞాననందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎఫ్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిన్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# అన్ని శాఖలు 'ఏం' గ్రేడ్‌లో నిలవాలి

**- శత శాతం లక్ష్యాలను సాధించాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**





**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ ప్రాధాన్యత సూచికల (కీ ఫెర్‌ఫార్మెన్స్ ఇండికేటర్స్) అమలులో జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ శాఖల పనితీరును సమీక్షించిన కలెక్టర్, నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా జిల్లాలోని అన్ని శాఖలు తప్పనిసరిగా 'ఏం' గ్రేడ్ సాధించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువ కావడంలో కెపిఐ కీలకమని, ఆయా సూచీల్లో వెనుకబడిన శాఖలు తక్షణమే పురోగతి సాధించాలని సూచించారు. అంతకుముందు ప్రణాళికాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పియూష్ కుమార్ అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పియూష్ కుమార్ మాట్లాడుతూ, 2026-27 సంవత్సరానికి సంబంధించి 396 ఇండికేటర్స్‌లో అత్యుత్తమ గ్రేడ్‌లను సాధించేదుకు ఆయా శాఖల రాష్ట్ర ఉన్నతాధికారులు కృషి చేయాలని కోరారు. అలాగే మండలాలకు నిర్ధేశించిన 199 ఇండికేటర్స్‌లో మెరుగైన పనితీరును ప్రదర్శించాలన్నారు. 29వ తేదీనాటికి అన్ని నివేదికలను సమగ్రంగా అందజేయాలని చెప్పారు. జిఎస్‌డిపి లక్ష్యాలను వివరించారు. 1, 2, 3వ సవరించిన అంచనాలకు అనుగుణంగా మండలాల వారీగా కూడా ఎండిపిల అంచనాలను రూపొందించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సిపిఓ పి.బాలాజీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రైనేజీ సమస్యను పరిష్కరించిన డాక్టర్ కందుల నాగరాజు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, 32 వవార్డు మాజీ కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు ఎప్పుడు ముందు ఉన్నారు. అధికారం ఉన్న లేకపో యినా సరే ప్రజలకు సేవలు చేస్తూ వారి అభిమానాన్ని చూరగొం టున్నారు. ఈ క్రమంలోనే వార్డులో దేవాంగుల వీధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య వల్ల అక్కడ స్థానికులు కొన్ని రోజులుగా చాలా ఇబ్బందులు పడుతున్నారు. కందుల నాగరాజు దృష్టికి ఈ సమస్యను తీసుకు వచ్చారు. వెంటనే ఆయన దీనిపై స్పం దించి సంబంధిత అధికారులకు ఈ విషయం తెలియజేశారు. సిబ్బంది ద్వారా డ్రైనేజీ సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భం గా డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ తాను ఎప్పుడు ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని చెప్పారు. ఎవరికి ఎటువంటి సమస్యలు వచ్చినా దానిని పరిష్కరించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తానని వెల్లడించారు. ప్రజలకు సేవ చేయడం మాత్రమే తనకు తెలుసు అని చెప్పారు. ఎప్పటికప్పుడు ప్రజలతో మమేకమవుతూ, వారి కష్టసుఖాలు తెలుసుకుంటూ, తన పరిధి మేరకు వారికి సహాయం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యూజీడి వర్క్ ఇన్స్పెక్టర్ ఆర్.కిషోర్, సానిటరీ సెక్రటరీ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# జడ్.పి.హెచ్.ఎస్‌లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని ముచ్చర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థినిలు, విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గార తవుడు, మాజీ ఎంపీటీసీ కరుమజ్జి కృష్ణ, ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమ్మెపై చర్చలు.. పెండింగ్ సమస్యల పరిష్కారంపై కీలక నిర్ణయాలు



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** మంత్రులు, ఆర్టీసీ సంఘాల నేతల మధ్య చర్చలు సుహృద్భావ వాతావరణంలో కొనసాగుతున్నాయి. మంత్రుల బృందం అన్ని సంఘాల అభిప్రాయాలను సవివరంగా నమోదు చేసుకుంటోంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే తమ దశాబ్దాల పెండింగ్ సమస్యలు తీరాయని ఈ సందర్భంగా ఆర్టీసీ సంఘాల నేతలు మంత్రులకు చెప్పారు. గత ప్రభుత్వంలో 55 రోజులు సమ్మె చేసినా ఎలాంటి హామీ నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండు సంవత్సరాల కాలంలోనే 2013 బాండ్స్.. రూ. 280 కోట్లు క్లియర్ చేసిందని తెలిపారు. 2017కి సంబంధించి పీఆర్సీ ఇచ్చిందని.. డీఏలు పెండింగ్ లేకుండా చేసిందని.. సీసీఎస్, పీఎఫ్ బకాయిలు తీర్చిందని వెల్లడించారు. యూనియన్‌లు లేకపోవడంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అనేక కార్మిక సంక్షేమ కార్యక్రమాలకు ప్రచారం జరగలేదని మంత్రులకు ఆర్టీసీ సంఘాల నేతలు వివరించారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan